


సింహాచలం దేవస్థానంలో సినీ హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను


అభిమానులకు హీరో బాలకృష్ణ అభివాదం

బాలయ్య సందడి

నగరంలోని జగదాంబ థియేటర్‌లో మంగళవారం రాత్రి 'అఖండ-2' సినిమాలోని పాటను విడుదల చేసిన సందర్భంగా స్టెప్ వేస్తున్న నందమూరి బాలకృష్ణ. చిత్రంలో హీరోయిన్ సంయుక్త మీనన్, దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత గోపి ఆచంట ఉన్నారు. - వార్త

'చిత్రజ్యోతి'లో...

అప్పన్న సన్నిధిలో 'అఖండ-2' టీమ్

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అఖండ-2' సినిమా హీరో నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత రామ్ ఆచంట మంగళవారం సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. సినీ ప్రముఖులకు దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. బాలకృష్ణ, బోయపాటి శ్రీను, తదితరుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్పస్తంభ ఆలింగనం, బేడామండప ప్రదక్షిణ, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేసిన తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

అన్నదాత సుఖీభవ డబ్బులు జమ నేడు

- జిల్లాలో 18వేలమంది రైతుల ఖాతాలకు సొమ్ము

- 6వ పేజీలో

మహా విడ్డూరం

అగ్నిమాపక శాఖ అధికారికి భూ వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యత!

- జీవీఎంసీ ఎస్టేట్ అధికారిగా నియామకం
- రాజకీయ పలుకుబడితోనే....
- ఆ పోస్టులో రెవెన్యూ శాఖ అధికారి ఉన్నా పక్కనపెట్టేసిన వైనం
- జీవీఎంసీ పరిధిలో భూములు, రికార్డుల పరిరక్షణలో ఎస్టేట్ అధికారే కీలకం
- అవగాహనలేని అధికారి ఏం చేస్తారని విస్మయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీ గుర్తింపుపొందింది. ఏ స్థానిక సంస్థకు లేనన్ని ఆస్తులు విశాఖపట్నం నగర పాలక సంస్థకు ఉన్నాయి. వాటిని అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతోపాటు రికార్డులకు కస్టోడియన్‌గా ఎస్టేట్ అధికారి వ్యవహరించాలి. జీవీఎంసీ ఆస్తులను ఆక్రమించుకునేందుకు ఎవరైనా యత్నిస్తే చట్టపరంగా అడ్డుకోవడం, కోర్టులో కేసులుపడితే స్టాండింగ్ కౌన్సిల్‌కు అవసరమైన రికార్డులను అందజేసి భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించుకోవడం చేయాలి. అంతటి కీలకమైన పోస్టులో భూ వ్యవహారాల్లో ఆరితేరిన రెవెన్యూ శాఖ అధికారులను డెప్యూటేషన్‌పై నియమిస్తారు. కానీ ఇప్పుడు అగ్నిమాపక శాఖ అధికారిని నియమించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



జీవీఎంసీకి రూ.వేల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. నగర పరిధిలో పార్కులు, ఓపెన్‌స్పేస్‌లు కలిపి 1300కి పైగా ఉన్నాయి. ఇవన్నీ ప్రైవేటు, వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌ల ద్వారా జీవీఎంసీకి దఖలు పడ్డాయి. ఇవికాకుండా క్రీడా మైదానాలు, స్టేడియాలు, సామాజిక భవనాలు, కల్యాణ మండపాలతోపాటు నగర పాలక సంస్థకు చెందిన కార్యాలయాల భవనాలు వంటివి ఎన్నో ఉన్నాయి. వాటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులకు ఎస్టేట్ ఆఫీసర్ కస్టోడియన్‌గా వ్యవహరిస్తారు. భూములకు సంబంధించిన వ్యవహారం కాబట్టి టౌన్‌ప్లానింగ్ అధికారులకు పెద్దగా ఉండదనే ఉద్దేశంతో రెవెన్యూ శాఖ నుంచి తహశీల్దార్ స్థాయి అధికారిని డెప్యూటేషన్‌పై నియమిస్తుంటారు. ఆ ఎస్టేట్ అధికారి ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో టౌన్‌సర్వేయర్లు విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎవరైనా భవన నిర్మాణం కోసం లేదంటే క్రయ,విక్రయాల కోసం స్థలం/భూమికి సంబంధించిన సర్వే సర్టిఫికెట్ కావాలని జీవీఎంసీ కమిషనర్‌కు దరఖాస్తుచేసుకుంటే ఎస్టేట్ అధికారి ద్వారా సంబంధిత జోన్ టౌన్ సర్వేయర్‌కు పంపిస్తారు. టౌన్‌సర్వేయర్ ఆ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతోపాటు రికార్డుల పూర్వాపరాలను పరిశీలించి దాని స్వభావం, యజమాని, విస్తీర్ణం వంటి వివరాలతో నివేదిక తయారు చేసి ఎస్టేట్ అధికారికి అందజేస్తారు. ఎస్టేట్ అధికారి ఆ సర్వే రిపోర్టును క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు తన వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి సర్వేయర్ సక్రమంగానే నివేదిక ఇచ్చారని నిర్ధారించుకున్న తర్వాత కౌంటర్ సంతకం చేసి దరఖాస్తుదారుడుకు సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా జీవీఎంసీకి చెందిన

... మిగతా 6వ పేజీలో


హెలీ టూరిజం

మళ్లీ హెలీ టూరిజం

భాగస్వామ్య సదస్సులో విహంగ్ అడ్వెంచర్స్ ఒప్పందం

- క్రూయిజ్ నడపడానికి పలు సంస్థల ఆసక్తి
- ఇబ్బడిముబ్బడిగా గోల్ఫ్ కోర్సులు
- 'ప్లానెక్స్ రీసైక్లింగ్ ప్రైవేటు లిమిటెడ్', 'సన్‌విక్ గోల్ఫ్' సంస్థల ఎంఓయూలు
- రూ.750 కోట్లు పెట్టుబడులు, 5,000 మందికి ఉద్యోగాలు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టడానికి అనేక సంస్థలు ఆసక్తిగా ముందుకువస్తున్నాయి. వీటిలో కొన్ని గత వారం జరిగిన భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి.



విశాఖ మహా నగరాభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఎనిమిదేళ్ల క్రితం హెలీ టూరిజం తీసుకువచ్చింది. బీచ్‌రోడ్డులో వుడా పార్కు నుంచి రుషికొండ వరకూ రూ.2,500 టిక్కెట్ పెట్టి ప్రయోగాత్మకంగా నడిపింది. విశాఖ నుంచి అరకులోయ కూడా నడపాలని యత్నించింది. సాంకేతిక కారణాల వల్ల అది ముందుకు వెళ్లలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక అభివృద్ధి కోసం ఎటువంటి అనుమతులైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉండడంతో మళ్లీ హెలీ టూరిజం నగరంలో ప్రారంభించడానికి విహంగ్ అడ్వెంచర్స్ సంస్థ సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.20 కోట్లు వెచ్చించి గగన విహారాన్ని విశాఖ ప్రజలకు అందుబాటులోకి తేవడానికి నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు వల్ల 130 మందికి ఉపాధి లభించనుంది. వింగ్ మాస్టర్స్ కో అనే సంస్థ ఏరో అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు రూ.5 కోట్లు పెట్టుబడి పెడతామని, 70 మందికి ఉద్యోగాలు ఇస్తామని ఎంఓయూ చేసింది. టెర్మినల్ హోల్డింగ్స్ అనే సంస్థ రూ.500 కోట్లతో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఒప్పందం చేసింది. ఇది శ్రీకాకుళం జిల్లాలో వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. దీని ద్వారా 2,200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. విశాఖపట్నం పోర్టు రూ.100 కోట్ల

... మిగతా 6వ పేజీలో

శబరిమల రైళ్లు ఫుల్

- టాటా-ఎర్నాకులం, బొకారో ఎక్స్‌ప్రెస్‌లలో జనవరి 15 వరకూ బెర్తులు రిజర్వు
- కొల్లాం ఎక్స్‌ప్రెస్‌కూ అదే పరిస్థితి
- విశాఖ-కొల్లాం ప్రత్యేక రైలులో డిసెంబరు నెలాఖరు నుంచి ఖాళీలు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఎర్నాకులం, కొల్లాం ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో జనవరి వరకూ బెర్తులు లభించని పరిస్థితి నెలకొంది. బొకారో ఎక్స్‌ప్రెస్ (13351), టాటా-ఎర్నాకులం (18189) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు ప్రతి గురువారం విశాఖ నుంచి బయలుదేరే కొల్లాం ఎక్స్‌ప్రెస్ (18567)లో జనవరి 15 వరకూ బెర్తులు ఖాళీ లేవు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రతి మంగళవారం విశాఖలో బయలుదేరి బుధవారం కొల్లాం చేరేలా వాల్తేరు రైల్వే అధికారులు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు మిశ్రమ డిమాండ్ ఏర్పడింది. ప్రత్యేక రైలు (08539)లో డిసెంబరు 9, 16, 23, 30,



జనవరి 6 తేదీల్లో ఏసీ కోచ్‌లలో, డిసెంబరు 30, జనవరి 6న స్లీపర్‌లో ఖాళీలు ఉన్నాయి.

కొల్లాం ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 15 వరకూ బెర్తులు ఫుల్

విశాఖ-కొల్లాం ఎక్స్‌ప్రెస్ (18567)కు జనవరి 15 వరకు బెర్తులు నిండిపోయాయి. అత్యధిక శాతం అయ్యప్ప భక్తులు ఈ రైలునే ఆశ్రయిస్తారు. అయితే విశాఖ నుంచి కొల్లాంకు ఒకే ఒక ఒరిజినేటింగ్ రైలు (వారాంతపు) అందుబాటులో ఉన్న నేపథ్యంలో అయ్యప్ప భక్తుల అవసరాలు తీరడం లేదు. గతంలో నాలుగు నెలల ముందస్తు రిజర్వేషన్ సదుపాయం ఉన్నప్పుడు మాలధారణకు ముందే యాత్ర తేదీలకు అనుగుణంగా రిజర్వేషన్ పొందేవారు. ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని రెండు నెలలకు కుదించడంతో అయ్యప్ప భక్తులకు ఆశించిన స్థాయిలో బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో విశాఖ మీదుగా ఎర్నాకులం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లను ఆశ్రయిస్తున్నారు.

కొల్లాం ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంపుపై వినతి

విశాఖ-కొల్లాం ఎక్స్‌ప్రెస్ (18567) రైళ్ల సర్వీసుల ఫ్రీక్వెన్సీ పెంచాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉన్నా రైల్వే అధికారులు దృష్టి సారించడం లేదు. కొల్లాం ఎక్స్‌ప్రెస్‌కు కేవలం శబరిమలై యాత్ర సమయంలోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ ఆక్యుపెన్సీ ఎక్కువగానే ఉంటోంది. రేణిగుంట, గూడూరు మీదుగా వెళ్లే కొల్లాం ఎక్స్‌ప్రెస్‌కు తిరుపతి ప్రయాణికుల డిమాండ్ ఉంది. దరిమిలా వారానికి రెండు రోజులు (బైవీక్లీ) అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

బొకారో ఎక్స్‌ప్రెస్ జనవరి 17 వరకు ఫుల్

విశాఖ మీదుగా నడిచే ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351)లో జనవరి 17వ తేదీ వరకూ అన్ని తరగతుల బెర్తులు నిండిపోయాయి. అలాగే బొకారో ఎక్స్‌ప్రెస్‌తో కనెక్టవిటీ నడిచే

... మిగతా 6వ పేజీలో

పెట్రోలియం వర్సిటీ రెడీ

సబ్బవరం మండలం వంగలిలో రూ.400 కోట్లతో భవనాల నిర్మాణం

- మరో రూ.100 కోట్లతో ల్యాబ్, రూ.50 కోట్లతో ఫర్నీచర్, ఇతర వసతులు
- జనవరి ఐదో తేదీ నుంచి నూతన క్యాంపస్‌లో తరగతులు ప్రారంభానికి సన్నాహాలు
- ప్రస్తుతం ఏయూలో నిర్వహణ


సబ్బవరం మండలం వంగలిలోని పెట్రోలియం వర్సిటీ భవనం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)కి శాశ్వత క్యాంపస్ సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 157.36 ఎకరాల్లో భవన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. దీంతో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి అక్కడకు షిఫ్ట్ అయ్యేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి శాశ్వత క్యాంపస్‌కు వెళ్లాలని అధికారులు భావించారు. అయితే, కొన్ని పనులు పెండింగ్‌లో ఉండడం, ఇతర కారణాలతో జనవరి ఐదో తేదీ నుంచి శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు.

వంగలిలో సుమారు రూ.400 కోట్ల వ్యయంతో భవన నిర్మాణాలను చేపట్టారు. మరో రూ.100 కోట్లతో అత్యాధునిక లేబొరేటరీ, లైబ్రరీ, మరో రూ.50 కోట్లతో ఫర్నీచర్, ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చుకున్నారు. ప్రస్తుతం వర్సిటీ అవసరాలకు అనుగుణంగా మొదటి ఫేజ్ నిర్మాణాలను పూర్తిచేశారు. భవిష్యత్తు అవసరాల కోసం రెండో ఫేజ్ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఇందుకోసం కూడా కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరుచేసింది. విభజన చట్టం

... మిగతా 6వ పేజీలో

మద్యం తాగాలని వేధిస్తున్నారు!

- డబ్బులు డిమాండ్ చేస్తున్నారు
- సీనియర్లపై కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ సమక్షంలో వీసీకి ఫిర్యాదు చేసిన ఏయూ విద్యార్థి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జూనియర్ విద్యార్థులను సీనియర్లు వేధిస్తున్నారు. మత్తు పదార్థాలు వినియోగించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయాన్ని వేధింపులకు గురైన ఒక విద్యార్థి మంగళవారం జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ సమక్షంలో ఏయూ వైస్ చాన్సలర్ దృష్టికి తీసుకువచ్చారు. వివరాల్లోకి వెళితే... మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'నషా ముక్త అభియాన్' ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. దీనిని వర్చువల్ విధానంలో లైవ్ స్ట్రీమింగ్ చేశారు. ఆడిటోరియంలో కార్యక్రమం ముగింపు సమయంలో ఒక విద్యార్థి లేచి


కౌశిక్ బిస్వాస్

మైక్ అందుకున్నాడు. అతని పేరు కౌశిక్ బిస్వాస్. బంగ్లాదేశ్‌కు చెందిన కౌశిక్ ప్రస్తుతం ఏయూలో బీబీఏ తొలి ఏడాది చదువుతున్నాడు. విదేశీ విద్యార్థులకు కేటాయించిన హాస్టల్‌లో ఉంటున్న తనను నెల రోజులుగా బంగ్లాదేశ్‌తోపాటు ఇతర దేశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు మద్యం తాగాలంటూ ఒత్తిడి చేస్తున్నారని వాపోయాడు. మద్యం తాగనని చెప్పినందుకు పలుమార్లు తనపై దాడి చేశారని, ఇదే విషయాన్ని విదేశీ వ్యవహారాల డీన్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు వెల్లడించాడు. సదరు విద్యార్థులను అధికారులు హెచ్చరించినప్పటికీ ఫలితం లేదని, ఇప్పటికీ తనపై వేధింపులు ఆగలేదని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన

... మిగతా 6వ పేజీలో

పందలపాకలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

- తమ భూముల కోసం దర్జాగా రోడ్డు నిర్మించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం పందలపాకలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డు నిర్మించారు. ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేటు భూమి కూడా ఆక్రమించారని తహశీల్దార్‌కు, స్థానిక పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అధికారులు విచారణ జరుపుతున్నారు. పందలపాకలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన భూమికి రహదారి లేకుండా పోయింది. దీంతో వారి భూమి ముందు సర్వే నంబరు 52-1లో గల గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి దర్జాగా రోడ్డు నిర్మించారు. ఇందుకోసం ప్రభుత్వ భూమితో పాటు కొంతమంది ప్రైవేటు వ్యక్తుల స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారు. దీనిపై స్థానికులు, వీఆర్వో చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరుపుతున్నారు. అయితే ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు వెనుకాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఆనందపురం మండలం పందలపాకలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన రోడ్డు నిర్మాణం

నేడే పద్మనాభుడి దీపోత్సవం

పద్మనాభం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కొండపై ఆలయం వద్ద, ఉత్సవ విగ్రహాలు నిలిపే మెట్ల మార్గం వద్ద, కుంతీ మాధవస్వామి ఆలయం, నారాయణేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూ లైన్లను ఏర్పాటుచేశారు. కొండ మెట్లకు ఇరువైపులా నూనె దీపాలను ఒకేసారి వెలిగించడం ఈ ఉత్సవం ప్రత్యేకత. దీపాలను వెలిగించడానికి భక్తులు మధ్యాహ్నం నుంచి మెట్లను రిజర్వు చేసుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు కొండపై జేగంట కొట్టగానే, మెట్లపై ఏర్పాటుచేసిన నూనె దీపాలను భక్తులు వెలిగిస్తారు. ఉత్సవ నేపథ్యంలో ఆలయాలతో పాటు రోడ్డుకు ఇరువైపులా విద్యుద్దీపాలతో అలకరించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణదేవి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు.


అనంతుని మెట్ల మార్గం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

18 ప్రత్యేక బస్సులు

పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి వారి ఆలయానికి బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ 18 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. సింహాచలం కాంప్లెక్స్ నుంచి 12, తగరపువలస నుంచి 6 ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తగరపువలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేరుగా ప్రవేశాలకు అవకాశాన్ని కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీవాణి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులు ఈనెల 28లోగా ప్రవేశాలు పొందవచ్చన్నారు. బీఎస్సీలో కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, బీఏలో హిస్టరీ, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల్లో సీట్లున్నాయన్నారు. వివరాలకు 89788 83125, 85229 75829లో నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదాన వితరణ ప్రారంభం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడ అయ్యప్ప సేవా పీఠంలో మంగళవారం నిత్యాన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ప్రారంభించారు. మాలధారులకు ఉన్న ఆయన పీఠాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సేవా పీఠంలో 'సేవ పేరుతో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవా పీఠం ధర్మకర్త గాదు తాతినాయుడు, గురుస్వాములు కంటుభక్త వెంకన్న, కరుటుక్క అప్పలనారాయణ, కనకల అప్పలరాజు, శ్రీను, విశ్రాంత ఉపాధ్యాయులు మురళీమోహన్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో 3వ డివిజన్ ముందంజ

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు, సదుపాయాల కల్పనలో జీవీఎంసీ 3వ డివిజన్ ముందంజలో ఉందని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని అప్పికొండ వీధిలో మంచినీటి బోరుబావిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. బోయవీధిలో పైపులైన్లు సప్లై స్కీమ్, సామాజిక భవన ప్రహరీ నిర్మాణం, కేజీబీవీ రహదారి నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పికొండ నూకరాజు, అప్పికొండ నర్సింగరావు, సంకురుభక్త జోగారావు, కొక్కిరి నూకరాజు, కందుల సుందరరావు, గూడెపు రాజు, కొక్కిరి అప్పన్న, సంజీవరావు, జలగడుగుల మురళి, వియ్యపు పోతురాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితమే లక్ష్యంగా కవితలు రాయాలి


కవితాగోష్టిలో పాల్గొన్న రచయితలు

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతంగా రచయితలు రాసే కవితలతో సమాజానికి మేలు చేయాలని రచయిత ఇందూ రమణ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మంగళవారం కవి సమ్మేళనం జరిపారు. ఇందులో పాల్గొన్న ఆయన రచయితల కవితలను విశ్లేషించారు. తెలుగు ఆక్షరమాలతో కూడిన గేయం రాసి ఆలపించారు. నదివాలయ ఉద్యోగి ఎన్.శ్రీనివాస్ రాసిన మెగ్గవున్న బాల్యం, కొరాడ నరసింహరావు రాసిన 'ఆదరించండి' అనే కవితతోపాటు అప్పారావు రాసిన 'మన గ్రంథాలయం' కవిత, ఐండూరమణ రాసిన 'పుస్తకం తెచ్చిన మార్పు' రాసి చదివిన కవితలు సమాజం పట్ల రచయితల బాధ్యతలను తెలుపుతున్నాయని తెలియజేశారు. అనంతరం రచయితలను గ్రంథాలయాధికారి నరసింహం సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పకు అంబలం పూజ


అంబలం పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మధురవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మల్లయ్యపాలెంలో కలివేలు నూకబాబు (బుజ్జి) ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి అంబలం పూజ చేశారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు, భవానీ భక్తులు హాజరయ్యారు. కలివేలు అప్పలరాజు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. పడిపూజ అనంతరం స్వాములు, భవానీలకు భిక్షప్రసాదాలు అందజేశారు.

తిమ్మాపురంలో తాటితోపు దగ్ధం


దగ్ధమవుతున్న తాటి చెట్లు

సాగర్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం సముద్రతీరం రామానాయుడు స్టూడియో ఎదురుగా ఉన్న తాటితోపులో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు 30 తాటిచెట్లు దగ్ధమయ్యాయి.అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు తాటితోపులో ఆసాంఘిక కార్యక్రమాలు, మద్యం, ధూమపానం సేవించడమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో మందుబాబులు అడ్డాగా మారిందన్నారు.

జాతీయ సమైక్యత శిబిరంలో గీతం విద్యార్థి ప్రతిభ

సాగర్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ కేడెట్ ఆకాంక్ష జనీవల మేఘాలయ బెటాలియన్ అఖిల భారత స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభను చాటారు. దేశంలోని 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి ఎన్‌సీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల నుంచి చెందిన 400 మంది కేడెట్లు శిబిరంలో పాల్గొన్నారు. గీతం బీఫార్మసీ మూడో సంవత్సరం విద్యార్థిని ఆకాంక్ష వివిధ రాష్ట్రాల సంస్కృతులను అధ్యయనం చేయడంతో పాటు క్విజ్‌లు, డిబేట్‌లు, బృందగాన పోటీల్లో ప్రతిభను చాటారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎన్‌సీసీ అధికారులు ఆకాంక్షను అభినందించారు.

కేజీబీవీలో ఎమ్మెల్యే గంటా ఆకస్మిక తనిఖీ


విద్యార్థులకు భోజనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఆనందపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం కేజీబీవీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజన పదార్థాలను పరిశీలించడమే కాకుండా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన పదార్థాలతో భోజనం పెడుతున్నారా? అంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో తరగతి గదులు, డైనింగ్ హాలు, ఇతర సదుపాయాలు పరిశీలించారు. స్థానిక నాయకుడు సుభాన్ చంద్రబోస్ స్వచ్ఛందంగా హైస్కూల్‌కు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారని టీచర్లు ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తా

కొమ్మాది: కష్టపడి పనిచేసే కార్యకర్తలను ఎల్లప్పుడూ గుర్తించి ఉంటానని భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ ఆరోవార్డు అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన గోరే గురునాథ్‌తో ఆరోవార్డులోని పలువురు నాయకులు మంగళవారం శాసనసభ్యుడు గంటాను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, వార్డు అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని గంటా వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు గంటాను శాలువాతో సత్కరించారు. వాండ్రాసి అప్పలరాజు, నాగోతి వెంకట్రావు, పోతిన శ్రీను, వాండ్రాసి అప్పలరాజు, పోతిన పెంటయ్య, షేక్ సుభాని, కురుమోజు గోవిందరావు పాల్గొన్నారు.

అప్పన్నకు సంప్రదాయబద్ధంగా ఆర్జిత సేవలు


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం సహస్ర తులసీ దళార్చన, గరుడ సేవ, నిత్య కల్యాణం వంటి పలు ఆర్జిత సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై ఆధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన జరిపారు. తరువాత గోవిందరాజస్వామిని రజత గరుడ వాహనంపై ఉంచి పూజలు, అష్టోత్తర శతనామావళితో అర్చనలు చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో నిత్యకళ్యాణాన్ని వైభవంగా జరిపారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చాక భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

మహిళా సాధికారత దిశగా చర్యలు

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాజమండ్రి ఆర్‌జీఎస్‌బీ ఫ్యాకల్టీ బి.గాంధీ అన్నారు. మంగళవారం చేపలతిమ్మాపురంలో ది విశాఖపట్నం టౌన్ ఫిషర్ ఉమెన్ డ్రై ఫిష్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకుని రాష్ట్ర సహకార యూనియన్, రామచంద్ర సహకార శిక్షణ కేంద్రం రాజమండ్రి వారి ఆధ్వర్యంలో మత్స్యశాఖ సహకారంతో కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, మహిళల ఆర్థిక స్వావలంబన, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో ప్రణాళికా బద్ధంగా సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో విశాఖ మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు, తిమ్మాపురం డ్రై ఫిషర్ ఉమెన్ సొసైటీ అధ్యక్షురాలు మాలపల్లి పార్వతమ్మ, కార్యదర్శి మైలపల్లి ఎర్రమ్మ, డైరెక్టర్ దూడ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

కొమ్మాది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బు తీసుకుని మోసం చేసిన కేసులో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మధురవాడకు చెందిన విసాయికుమార్ 2023లో వారుష్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో డిజిటల్ మార్కెటింగ్ బిజినెస్ కంపెనీ ఏర్పాటు చేసి, ఉద్యోగాలిప్పిస్తామని, ట్రైనింగ్ పీరియడ్‌లో నెలకు రూ.15వేలు స్టైఫండ్, శిక్షణ ముగిసిన తరువాత రూ.31 వేలు జీతం ఇస్తామని నమ్మబలికారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష సేకరించాడు. కంపెనీకి ప్రాజెక్టులు లేకపోవడంతో జీతాలు ఇవ్వలేదు. వారు కట్టిన డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బోయిగుంటి సాయికుమార్, రమేష్ చైతన్య కంపెనీ సీఈవో వి.సాయికుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

» ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి


అవగాహన ర్యాలీలో విద్యార్థులు, ప్రిన్సిపాల్ శ్రీవాణి, లెక్చరర్లు

తగరపువలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నషాముక్త భారత్ అభియాన్ ప్రారంభమై ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో ఈ కార్యక్రమం గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవాణి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలామంది నేడు యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను కోల్పోతున్నారని, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తగరపువలస కొండపేట ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. నషాముక్త భారత్ అభియాన్ పేరుతో ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో లెక్చరర్లు డా.పి.సన్యాసిరావు, బి.ఎస్.శ్రీనివాసనాయుడు, ఎ.విజయలక్ష్మి డాక్టర్ పి.సనదంధ ప్రభాకర్ పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్నందుకు కత్తితో దాడి

» రియల్ ఎస్టేట్ వ్యాపారికి తీవ్ర గాయాలు


గాయపడిన అప్పలరాజు

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమన్నందుకు కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన జరిగింది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల మేరకు.. కొత్తవలసలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే అప్పలరాజు, అదే గ్రామానికి చెందిన బీజపు శ్రీనివాస్ రూ.2.2 లక్షలు అప్పిచ్చాడు. తీర్చమని అప్పలరాజు కోరుతూ వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వివాదం నెలకొంది. అప్పు తీర్చకుంటే కోర్టుకు వెళతానంటూ అప్పలరాజు హెచ్చరించడంతో ఆగ్రహించిన శ్రీను కత్తితో దాడికి పాల్పడ్డాడు. అనూహ్య పరిణామానికి అందోళన చెందిన అప్పలరాజు పరుగు పెట్టాడు. అతడిని కుటుంబసభ్యులు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దాడిలో శ్రీనుతో బాటు అతని తండ్రి చిన్న, మరో వ్యక్తి పాల్గొన్నారని అప్పలరాజు ఫిర్యాదు చేశారు. నిందితుడు శ్రీను పరారీలో ఉన్నాడని, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయోద్యమం, గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మహేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు, పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ, పొలిపల్లి నర్సింగరావు, లచ్చు బుగత ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతుని దీపోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి: సీపీ


దీపోత్సవం ఏర్పాట్లను తెలుసుకుంటున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పద్మనాభం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలో బుధవారం అనంతపద్మనాభుని దీపోత్సవాన్ని అవాంఛనీయ ఘటనలు జరగకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. దీపోత్సవ ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతుని గిరి, మెట్ల మార్గం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేటప్పుడు ప్రైవేట్లు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంబులెన్సులు సులభంగా వెళ్లగలిగేలా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. మెట్ల మార్గంలోని రద్దీని దృష్టిలో పెట్టుకుని రోప్ పార్టీలను అవసరాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ఉత్సవం జరిగే ప్రదేశాలతో పాటు ట్రాఫిక్‌ను పరిశీలించాలన్నారు. మొత్తం ప్రాంతాన్ని అణువణువు నా జల్లెడ పట్టాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది మెట్లమార్గంలో నిరేశించిన స్థలాల వద్ద అందుబాటులో ఉండి భక్తులు దర్శనం చేసుకునే విధంగా చూడాలన్నారు. క్యూలైన్లలో రద్దీని నియంత్రించడానికి భక్తులు నిరీక్షించకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే విధంగా చూడాలన్నారు. భక్తులకు మార్గదర్శకం చేసే బోర్డులను కొండకింద ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, దేవదాయశాఖ తదితర అన్ని శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ అప్పలరాజు, ఏపీఆర్‌పీఎస్‌ఐ ఈశ్వ సింహాచలం నాయుడు, సీఐ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ సాయి, ఎంపీడీఓ రూపేష్‌కుమార్, ఆలయ ఈఓ పీవీఎస్‌ఎన్ రాజు, ఎంపీపీ కె.రాంబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీ అనంతపద్మనాభుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం

మధురవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అన్నారు. వార్డు పరిధిలోని పీఎంపాలెంలో మంగళవారం ఆమె జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. దీనికోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సేవ లు మరువలేనివన్నారు. కార్మికులకు మూడు చీరలు, మూడు జాకెట్లు, పురుషులకు మూడు యూనిఫారాలు, మూడు తువ్వాళ్ల అందించారు. తెలుగుయువత మల్లయ్యపాలెం వెళ్లిన కార్పొరేటర్ సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, కాలువల తదితర సమస్యలు గుర్తించారు. పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కూటమి నాయకులు కెఆప్పలరావు, బయపల్లి శ్రీరామమూర్తి, సూరిబాబు, నరసింహనాయుడు, నాయుడు పాల్గొన్నారు.

కొమ్మాది: పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. వార్డు పరిధిలో కార్మికులకు జీవీఎంసీ సమకూర్చిన వస్త్రాలను మంగళవారం ఆమె అందజేశారు. నగర పరిశుభ్రతకు కార్మికులు నిరంతరం కష్టపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, ఈగల రవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెట్రోలియం వర్సిటీ రెడీ

... 5వ పేజీ తరువాయి

ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ వర్సిటీని రాష్ట్రానికి కేటాయించగా, 2016 నుంచి ఏయూలోని తరగతులు నిర్వహిస్తున్నారు. పెట్రోలియం ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

గృహ రేటింగ్ సాధించేలా..

వాతావరణానికి హాని కలిగించకుండా, సహజ వనరులను సద్వినియోగం చేసుకునే విధంగా ఉండే భవన నిర్మాణాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హేబిటేట్ అసెస్‌మెంట్ (గృహ) పేరుతో రేటింగ్స్ ఇస్తోంది. గృహ రేటింగ్ 4 సాధించేలా పెట్రోలియం వర్సిటీ భవన నిర్మాణాలను పూర్తిచేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, వినియోగించిన నీరు రీసైక్లింగ్ చేసే టెక్నాలజీ, తరగతి గదులు, ఇతర హాల్స్‌లోకి వెంటిలేషన్ వచ్చేలా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై వర్సిటీ అధికారులు మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు నాలుగు వారాలు సెలవులు ఉంటాయని, అనంతరం నేరుగా నూతన క్యాంపస్‌లోకి వస్తారన్నారు.

'కేసుల రాజీకి పోలీసులు చొరవచూపాలి'

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజీకి అవకాశం ఉన్న కేసుల విషయంలో పోలీసులు చొరవ చూపాలని జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో ఉన్న చిన్నచిన్న క్రిమినల్ కేసులు, ఎక్సైజ్, మోటారు వాహన ప్రమాదాలు, కుటుంబ న్యాయస్థానానికి సంబంధించిన కేసులు రాజీ కుదిరేలా చేయాలన్నారు. కక్షిదారులకు ముందుగా నోటీసులిచ్చి, సంబంధిత న్యాయవాదులతో మాట్లాడి పరిష్కరించుకునేందుకు సహకరించాలన్నారు. ఈ మేరకు గ్రామీణ, నగర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

మెరుగైన సేవలకు సహకరించండి: సీపీ


కార్యాలయం ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడంతో పాటు సైబర్‌నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత కు సంబంధించిన అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారుచేయాలని సొసైటీ ఫర్ విశాఖ సెక్యూరిటీ కౌన్సిల్ సొసైటీ ప్రతినిధులను సీపీ శంఖబ్రతబాగ్చి కోరారు. పోలీస్‌కమిషనరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రజలకు పోలీస్‌శాఖ తరఫున మెరుగైన సేవలు అందించడంతోపాటు సైబర్‌సెక్యూరిటీ, మహిళల భద్రత, చిన్నారుల హక్కుల పరిరక్షణ, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలను సమర్థంగా అడ్డుకట్టవేసేందుకు ప్రణాళికలను తయారుచేయాలని కోరారు. యువత అభ్యున్నతికి పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను భాగస్వాములను చేయడం, సమాజ నిర్మాణంపై అవగాహన, సామాజిక భద్రతపై చైతన్యం కల్పించే కార్యక్రమాలను పోలీసులతో కలిసి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు మణికంఠచందోలు, మేరీప్రశాంతి, ఏడీసీపీలు, సొసైటీ ప్రతినిధులు కృష్ణబాబాజీ, దీరజ్ పాల్గొన్నారు.

మహా విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

భూమి/పార్కు/గెడ్డ/భవనానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవడం, కబ్జా చేసి నిర్మాణం చేపట్టడం చేస్తే ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పోలీసులకు లేదంటే టౌన్‌ప్లానింగ్ అధికారులకు అందజేసి పరిరక్షించాల్సిన బాధ్యత ఎస్టేట్ అధికారిపైనే ఉంటుంది. అలాగే లీజ్ సెటిల్మెంట్, కమిషనర్ వంటి ఉన్నతాధికారులకు ఏదైనా భూమికి సంబంధించిన అంశంపై సందేహం తలెత్తినా, ఫిర్యాదులు అందినా రికార్డులను పరిశీలించి వివరాలను వివరించాల్సిన బాధ్యత కూడా ఎస్టేట్ అధికారిపైనే ఉంటుంది. అందుకే ఎస్టేట్ అధికారి పోస్టులో భూ వ్యవహారాలు, వివాదాల పరిష్కారంలో అనుభవం కలిగిన సీనియర్ తహశీల్దార్ స్థాయి అధికారిని నియమిస్తుంటారు.

ఎస్టేట్ అధికారి ఉండగానే మరొకరు!

కానీ ఏం జరిగిందో తెలియదుగానీ తహశీల్దార్ స్థాయి అధికారిణి ఎస్టేట్ అధికారిగా ఉన్నప్పటికీ అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న ఒక అధికారిని తీసుకొచ్చి రెండో ఎస్టేట్ అధికారిగా నియమించారు. ఒకవేళ పనితీరులో, మరో కారణం చేతనో రెండో ఎస్టేట్ అధికారి అవసరమని భావించినా, భూవ్యవహారాలపై అవగాహన ఉన్న రెవెన్యూ శాఖ నుంచి మాత్రమే నియమించుకోవాలి.కానీ అందుకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారు. కొద్దినెలల కిందట డిప్యూటేషన్‌పై వచ్చినప్పటికీ ఈ విషయం బయటకు పొక్కలేదు. ఎస్టేట్ అధికారిగా ఉన్న రెవెన్యూ అధికారికి అధికారాలు సైతం ప్రాధాన్యం ఇవ్వకుండా అగ్నిమాపక శాఖ నుంచి వచ్చిన అధికారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. తాజాగా కొంతమంది టౌన్ సర్వేయర్లతో సదరు అధికారి దురుసుగా వ్యవహరిస్తుండటంతో అగ్నిమాపక శాఖ అధికారి ఎస్టేట్ అధికారిగా నియమితులయ్యారనే విషయం బయటకు వచ్చింది. ఈ విషయం గురించి జీవీఎంసీ అధికారులతోపాటు కార్పొరేటర్లు సైతం ఉన్నతాధికారి వద్ద ప్రస్తావించగా, రాజకీయ పలుకుబడితో వచ్చారని సమాధానం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అగ్నిమాపకశాఖ అధికారి జీవీఎంసీకి చెందిన విలువైన భూముల అన్యాక్రాంతం అయితే ఎలా గుర్తిస్తారు, వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి నివేదిక తయారుచేయాలో ఎవరికి అందజేయాలనేది ఎలా తెలుస్తుందని విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

మద్యం తాగాలని వేధిస్తున్నారు!

... 5వ పేజీ తరువాయి

ఏయూ వీసీ నెల రోజులు కిందట జరిగిన ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాలు, మద్యం వర్సిటీ ప్రాంగణం ఉండేలా చేస్తామని స్పష్టం చేశారు.

మళ్లీ హెలీ టూరిజం

... 5వ పేజీ తరువాయి

వ్యయంతో ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ నిర్మించింది. దీనిని సద్వినియోగం చేయాలని పర్యాటక శాఖ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. కార్డీలియా గ్రూప్ ప్రతినిధులను తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడించింది. కాకినాడ-విశాఖపట్నం-భీమిలి మధ్య ఒక క్రూయిజ్ నడపాలని ప్రభుత్వం కోరింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. ఇది కాకుండా శాండ్ క్రూయిజ్ ప్రైవేటు లిమిటెడ్ రూ.250 కోట్లతో క్రూయిజ్ మెరైన్ పెట్టడానికి ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

గోల్ఫ్ కోర్సులు

విశాఖపట్నంలో ముడసర్లోవ పార్కు పక్కనే ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఉంది. నేవీ అధికారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. పెద్ద మొత్తంలో భూములు అవసరమయ్యే ఈ ప్రాజెక్టులు పెట్టుబడులు పెట్టడానికి చాలామంది ముందుకు వచ్చారు. భోగాపురం, భీమిలి పరిసరాల్లో వీటికి భూములు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఫ్లాన్టెక్ రీసైక్లింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ గోల్ఫ్ కోర్సుతో పాటు రిసార్ట్ కూడా పెడతామని ముందుకు వచ్చింది. ఈ సంస్థ రూ.400 కోట్లు పెట్టుబడి పెట్టి, 4,200 మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. నన్‌టెక్ గోల్ఫ్ అనే సంస్థ రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టి 1,350 మందికి ఉద్యోగాలు ఇస్తామని ఎంఓయూ చేసింది.

శబరిమల రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)కు కూడా అంతే డిమాండ్ నెలకొంది. వీటితోపాటు రోజూ నడిచే డిబ్రూగఢ్-నాగర్‌కోయిల్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504)లో జనవరి 16 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

వారాంతపు రైళ్లకు డిమాండ్

వివిధ ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా ఎర్నాకులం చేరే వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనవరి 16 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి గురువారం నడిచే షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) జనవరి 15 వరకు, ప్రతి సోమ, బుధవారం అందుబాటులో ఉండే షాలిమార్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (22642) జనవరి 14 వరకు, ప్రతి శుక్ర శనివారం నడిచే పాట్నా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (22644) జనవరి 9 వరకు, ప్రతి శనివారం అందుబాటులో ఉండే సిల్చార్-తిరువేంద్రం ఎక్స్‌ప్రెస్‌ల (12508) జనవరి 3 వరకు, ప్రతి మంగళవారం నడిచే హటియా-ఎర్నాకులం ధార్తి ఆబ్బా ఎక్స్‌ప్రెస్ (22837)లో జనవరి 6 వరకు బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఉంది.

శ్రీకాకుళం, కొల్లాం ప్రత్యేక రైలుపై వినతి

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం వాల్తేరు రైల్వే అధికారులు 2023లో శ్రీకాకుళం-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడిపారు. ఈ ఏడాది అయ్యప్ప మాలధారుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గతంలో మాదిరిగా శ్రీకాకుళం రోడ్డు, కొల్లాం మధ్య ప్రవేశపెట్టాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ నిధుల జమ నేడు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకం రెండో విడత నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమ చేయనున్నారు. అర్హులైన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల వంతున, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.రెండువేలు విడుదల చేయనున్నాయి. జిల్లాలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల పరిధిలో 18 వేల మంది రైతులకు సుమారు రూ.12.5 కోట్లు అందుతాయని తెలిపారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి. 13వ వార్డు కార్పొరేటర్ సునీత, పాల్గొన్న పలువురు కూటమి నేతలు

ఆరిలోవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీతాసత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో యూజీడీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు వృథాపై నిర్లక్ష్యం


వాల్వ్ బిగించకపోవడంతో వృథాగా పోతున్న నీరు

ఆరిలోవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీ ఎంసీ 12వ వార్డులో గల నర్సరీ వద్ద పెద్ద నీటిధార వృథాగా పోతున్నది. ఈ నీటిని పట్టుకోవడానికి వాటర ట్యాంకు వారు ట్యాంకును నింపి నీటి వాల్వు బంద్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నీరు వృథా పోతున్నది. ఈ నీరంతా నర్సరీ ప్రాంతంలోకి వృథాగా పోతున్నది. దీన్ని అరికట్టకపోవడం వల్ల వేలాది లీటర్ల నీరు నేల పాలవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సముద్రంలో మత్స్యకారుడి మృతి


లక్ష్మణరావు (ఫైల్ ఫొటో)

బీచ్ రోడ్డు, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు సముద్రంలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. సహచరులు 9 మందితో కలిసి జాలారిపేటకు మేరుగు లక్ష్మణ్‌రావు (37) నాలుగు రోజుల కిందట బోటుపై వేటకు వెళ్లాడు. తీరానికి సుమారు వంద నాటికల్ మైళ్ల దూరంలో వేట చేస్తుండగా సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో బోటుకు లంగరు వేశారు. ఆ సమయంలో లక్ష్మణరావు కాలుకు లంగరు తాడు చుట్టుకుపోవడంతో అదుపుతప్పి సముద్రంలో పడిపోయాడు. అతడిని రక్షించడానికి సహచరులు తీవ్ర ప్రయత్నం చేశారు. కొంత సమయం తరువాత వెలికితీశారు. అప్పటికే అతడు మృతిచెందాడు. మృతదేహన్ని ఫిషింగ్ హార్బర్‌కు తీసుకువచ్చారు. లక్ష్మణరావు మృతితో జాలారిపేటలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబానికి పెద్దదిక్కు లేకపోవడంతో భార్య పద్మావతి, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒన్‌టౌన్ సీఐ వరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వచ్చే నెల 13న నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వేడుకలకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి సతీమణి సుధా నారాయణమూర్తి హాజరుకానున్నారు. ఈ మేరకు సంఘం వివరాలను వెల్లడించింది. ఏటా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తు న్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రంధి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏటా వేడుకలను నిర్వహిస్తు న్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

అన్నసమారాధన

పెదవాల్తేరు. నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని పెద వాల్తేర్‌లో గల వేంకటేశ్వర దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పునియోజక వర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు, టీడీపీ యువనేత వెలగపూడి ప్రతాప రుద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్నిప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డన చేశారు. ఆయనతో పాటు దశరథరామయ్య, పోతన రెడ్డి, పీతల అఖిల దేవుడుబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 40, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 60, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 56, బీరకాయలు 54, ఆనపకాయ 36, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 27, క్యారెట్ 56, దొండకాయలు 62, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 52, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60,కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడుచిక్కుడు 74, గోరుచిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

మహిళా భద్రతకు కలిసి పనిచేయాలి

- విశాఖలో అమలయ్యే విధానాలు ఆదర్శం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ


సదస్సు ప్రారంభిస్తున్న రాయపాటి శైలజ

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రజలంతా కలిసి పనిచేయాలని, ఇది ఒక వ్యక్తి, వ్యవస్థపై ఆధారపడి ఉండదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఏయూలో మంగళవారం 'సస్టైనింగ్ విమెన్- బెంచ్ మార్కింగ్ విశాఖపట్నం సక్సెస్ అండ్ ఫ్యూచర్ -ప్రూఫింగ్ గవర్నెన్స్' అంశంపై మహిళా కమిషన్, ఏయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

జాతీయస్థాయిలో మహిళా భద్రతపై నిర్వహించిన నారీ-2025 ఇండెక్స్‌లో జాతీయ స్థాయిలో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విశాఖ మహిళా భద్రతకు సురక్షితంగా నిలవడంపై అభినందించారు. సీఎం చంద్రబాబు సైతం అనేక సందర్భాల్లో విశాఖ ఎంతో సేఫ్ సిటీ అని చెప్పారన్నారు. మహిళల భద్రత కోసం ఇక్కడి విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ శారీరక భద్రత మాత్రమే కాదని, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించడం కూడా అన్నారు. విద్యతోనే ప్రతి మహిళకు పూర్తిస్థాయిలో భద్రత, భరోసా లభిస్తాయన్నారు. మహిళా సాధికారితకు ముందడుగు వేసేలా స్త్రీశక్తి పథకం నిలుస్తోందన్నారు. వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేశామని, మహిళల సమ్యలకు సూచనలు, సలహాలు, సహాయం అందిస్తామన్నారు. మూడు ప్రాంతాల్లో రూ.150 కోట్లతో వర్కింగ్ విమెన్స్ హాస్టల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళా విద్యా ర్థులకు భద్ర త కల్పించేలా మహిళా సెక్యూరిటీ గార్డులను నియమించా మ న్నారు. ఆరోగ్య సమాజం మహిళల భద్రతతోనే సాకారమవుతుం దన్నారు.విద్యార్థి విభాగంలో అసోసియేట్ డీన్‌గా మహి ళను నియమించామని, మూడు కీలకమైన డీన్ పోస్టులు, మూడు కళాశాలలకు ప్రిన్సిపాల్స్ మహిళలేనన్నారు. త్వరలో ఒక అధ్యయనం చేసి పాలసీ డాక్యుమెం ట్‌ను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళలకు భద్రత కల్పిం చే కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలే పోలీసులకు కళ్లు, చెవులు అన్నారు. మహిళలపై ఆన్‌లైన్ నేరాలు, వేధింపులు, అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్య యన కేంద్రం సంచాలకురాలు ప్రొఫెసర్ ఎ.పల్లవి సదస్సు నిర్వహణ, ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ అధికారులు, ఉద్యోగు లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- నషా ముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని అస్తవ్యస్తంగా మార్చి, కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాల జోలికిపోవద్దని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రి త్వశాఖ ఆధ్వ ర్యంలో ప్రారంభించిన నషా ముక్త అభియాన్ కార్యక్రమానికి ఐదేళ్లు పూర్తైన సందర్భంగా ఆశాఖ మంత్రి వీరేంద్ర కుమార్ మంగళవారం అమృత్‌సర్ నుం చి వర్చువల్‌గా వివిధ రాష్ట్రాల యువ తను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ సందేశాన్ని చదివి వినిపించారు. ఏయూలోని ఎంవీఎస్ మూర్తి ఆడిటో రియంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లా డుతూ మాదక ద్రవ్య రహితంగా విశాఖను తీర్చిదిద్దే మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఐదేళ్లలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, యువతలో చైతన్యం తీసుకువచ్చామన్నారు. డీ అడిక్షన్ సెంటర్ల ఆవశ్యకతను వివరించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ యువత మాద కద్రవ్యా లతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. నగరంలో ఎవరైనా తీవ్ర సమస్యలతో బాధపడితే డీ అడిక్షన్ కేంద్రాలను సంప్రదించాలని ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972, సీపీ వాట్సాప్ నంబరు 7005095799 గాని సంప్రదించాలన్నారు. అనంతరం ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) జోనల్ డైరెక్టర్ పంకజ్‌కుమార్ ద్వివేదీ మాట్లాడారు.కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సం క్షేమ శాఖ అసిస్టెం ట్ డైరెక్టర్ కవిత, అధికారులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కేపీ నాయుడు



విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది కేపీ నాయుడు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీచేశారు. కేపీ నాయుడు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఏయూ న్యాయకళాశాలలో చదివిన నాయుడు 2009లో న్యాయవాది వృత్తిని చేపట్టారు.

కేపీ నాయుడు నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నరసింగరావు, బైపా అరుణ్‌కుమార్, కె.రామయోగేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ అభినందించారు.

ఏయూ తెలుగుశాఖలో గ్రంథావిష్కరణలు


గ్రంథాలను ఆవిష్కరిస్తున్న వివిధ విభాగాల ఆచార్యులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సమావేశ మందిరంలో మంగళవారం మూడు గ్రంథాలను ఆవిష్కరించారు. శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ జర్రా అప్పారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో బాల సుధాకర్ రాసిన సంధువ గ్రంథాన్ని ప్రొఫెసర్ గజ్జా యోహాన్‌బాబు ఆవిష్కరించగా, అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎంఎస్ కృష్ణవేణి సమీక్షించారు. బాల సుధాకరమౌళి రాసిన యుద్ధంలో గ్రంథాన్ని ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న ఆవిష్కరించగా, భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వము గ్రంథాన్ని ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సంధువ కవిత్వం శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అణగారిన వర్గాల జీవితాన్ని, ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలు ప్రస్తావించిందన్నారు. చేపల్లో ఒకదాని పేరు సంధువ ఆ పేరును గ్రంథానికి పెట్టడం బాగుందన్నారు. యుద్ధం కవితా సంపుటిలో కుల, మత వ్యవస్థలపై చర్చించిన రచయిత ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ తెలుగు శాఖలో పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. యోహానుబాబు మాట్లాడుతూ బాల సుధాకర్ మత్స్యకారుల జీవిత చిత్రాన్ని మత్స్యకారుల కళింగ జీవితాన్ని చక్కగా ఆవిష్కరించారన్నారు. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న మూడు గ్రంథాల్లో సామాజిక చైతన్యం ప్రతిబింబిస్తోందన్నారు.

20 రోజుల్లో 'స్వర్ణభారతి' పూర్తిచేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం


స్వర్ణభారతి స్టేడియం పునర్నిర్మాణపనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం పునర్నిర్మాణపనులను 20రోజుల్లోగా పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన పనులు పరిశీలించారు. పరిసరాల్లో డెబ్రిస్ పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాదిన్నరగా పునర్నిర్మాణపనులు కొనసాగిస్తుండడంపై కాంట్రాక్టర్‌తోపాటు పనులను పర్యవేక్షిస్తున్న ఏపీయూఏఎంఎల్ ప్రతినిధులపై అసంతృప్తివ్యక్తంచేశారు. 20 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలోని వానవానిపాలెం, శివగణేష్‌నగర్‌లో ఉంటున్న వంక నందిని(20) ఈ నెల 14 నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఆమె తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు చేసింది. కొన్ని రోజులుగా భర్తతో విబేదాలతో తన ఇద్దరి పిల్లలతో తమ ఇంటికి వచ్చిందని, ఈ నెల 14 రాత్రి నుంచి ఆమె కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ ప్రత్యేక తనిఖీల్లో చలానాల మోత

- ఆర్టీవో, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ఆర్టీవో గోవిందరావు, ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ ఉల్లంఘనలు అరికట్టేందుకు మంగళవారం మద్దిలపాలెం కూడలిలో ఆర్టీవో, ట్రాఫిక్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీవో గోవిందరావు, ట్రాఫిక్ ఎస్ఐ జోగిరాజు ఆధ్వర్యంలో వాహనాల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలానాల మోతా మోగించారు. నిబంధనలు పాటించని వాహనాదారులపై కేసులు నమోదు చేసి కొత్త చలానాలు విధించారు. హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు రూ.1000, లైసెన్స్ లేని వాహనదారులకు బైక్ సీజ్‌తో పాటు రూ.5 వేలు ఫైన్ వేశారు. సెల్‌ఫోన్, ట్రిపుల్ డ్రైవింగ్‌లపై కొరడా ఝుళిపించారు. ఆటోలు, కార్లు, వ్యాన్‌లు, బైక్‌లను నిలిపి పెండింగ్ చలానాలు చెక్ చేశారు. చలానా పెండింగ్ వాహనాలకు చలానాలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. భారీ చలానాల వల్ల ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గుతాయన్నారు. సురక్షిత ప్రయాణానికి నియమ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు.

జేఆర్ నగర్‌లో రహదారి పక్కన చెత్తనిల్వలు


ప్రధాన మార్గంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు జేఆర్‌నగర్‌లో ప్రధాన మార్గంలో రోడ్డుపై చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఈ మార్గంలో నడిచే పాదచారులతో పాటు వాహనచోదకులు కూడా దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రతలో జాతీయ స్థాయిలో అవార్డు పొందిన కాలనీలో ఇటువంటి చెత్త నిల్వలు ఉండడం పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చెత్తను తొలగించి, రోడ్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

పెందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగి వున్న టిప్పర్‌ను ఢీట్టిన ఘటనలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుని ఆరుగంటలు నరకయాతన అనుభవించాడు. ఈ సంఘటన రాంపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం నుంచి ఫ్లయాష్ లోడుతో లారీ పద్మనాభం బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజాము 5గంటలకు రాంపురం వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. క్యాబిన్‌లో డ్రైవర్ సాయి (40) చిక్కుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయకచర్యలు చేపట్టి ఆరు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులదే కీలక పాత్ర

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత


ప్రతిజ్ఞ చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులదే కీలక పాత్రని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన నషా ముక్త భారత్ అభియన్ కార్యక్రమంలో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడమే కాకుండా, వాటివల్ల కలిగే దుష్పలితాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, కొకైన్, ఓపియం, హెరాయిన్, నార్కొటిక్స్ డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు వినియోగించి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు ఆర్పీ నాయుడు, మురళీకృష్ణ, సూన్య కుమారి, బాలమురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు సంస్మరణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి బి.ఆనందరావు, వివిధ గ్రంథాలయ శాఖల నుంచి అధికారులు కె.రాములు, పి.మల్లేశ్వరరావు, బి.పైడిరాజు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి వక్తలు గ్రంథాలయాల ప్రయోజనం, గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన, ఉద్యమించిన మహనీయుల గురించి ప్రసంగించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు మాయం

ఎంవీపీ కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చిన మహిళ మెడలో బంగారు గొలుసు మాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 16న రాత్రి చన్మయేశ్వరి తన అత్తను వెంకోజీపాలెం వద్ద గల మెడికవర్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఈసీజి పరీక్ష పూర్తయ్యాక చూసుకునే సరికి ఆమె మెడలోని సుమారు 28 గ్రాముల బంగారు గొలుసు మాయమయింది. వెంటనే ఆస్పత్రి సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో వేంచేసి యున్న నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరి మంగళవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని విశేష అభిషేకాలు చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార. పసుపు, కుంకుమ, విభూది, పుష్పాలు, రోజ్‌వాలు, తదితర వాటితో స్వామి వారిని భక్తులు స్వయంగా అభిషేకం జరిపారు.

భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. భక్తుల రద్దీతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది.



ర్యాలీలో పాల్గొన్న మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినులు



ర్యాలీలో పాల్గొన్న సెయింట్ జోసెఫ్ విద్యార్థినులు


ఎన్జీజీవోస్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

» చైతన్య ర్యాలీల్లో నినదించిన విద్యార్థులు, అతిథులు, అధ్యాపకులు

దాబాగార్డెన్స్/జ్ఞానాపురం/అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు తీసుకుంటే యువత జీవితం నాశనమవుతుందని వక్తలు హెచ్చరించారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్య రహిత భారత్ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మంగళవారం డాబాగార్డెన్స్, జ్ఞానాపురం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులు, పోలీసులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఆర్.మంజుల ప్రారంభించారు. ర్యాలీలో వాలంటీర్లు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ ఆర్.మంజుల మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.జె.లావణ్య, డా.బి.హైమావతి పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి నేతృత్వంలో ప్లకార్డులు పట్టుకొని విద్యార్థినులు ర్యాలీలో నినదించారు. అనంతరం కళాశాలలో వక్తృత్వం, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం జరిగింది. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తులు, కుటుంబాలు, యువత జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్న పరిస్థితులను వివరించారు. విద్యార్థులతోపాటు వారి కుటుంబాలు, స్నేహితులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలకృష్ణ, నాల్గో పట్టణ పోలీసులు, ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి రాష్ట్ర అంచనాల కమిటీ పర్యటన

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ ఈ నెల 26 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నట్లు ఏపీ లెజిస్లేటివ్ సెక్రటరీ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారథి, సునీల్‌కుమార్, సాంబశివరావు, సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణిలతో కూడిన కమిటీ 25న రాత్రికి విశాఖ చేరుకుంటుంది. 26న సింహాచలంలో దేవదాయ శాఖ అధికారులతోనూ, అనంతరం కలెక్టరేట్‌లో సమావేశాలు నిర్వహిస్తారు. రాత్రికి విజయనగరం సమీపంలోని రామనారాయణం సందర్శిస్తారు. 27న విజయనగరం పైడితల్లి అమ్మవారి దర్శనం తరువాత జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. 28న అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనం అనంతరం శ్రీకాకుళం జిల్లా అధికారులతో సమావేశమై అక్కడ నుంచి విజయవాడ తిరిగి వెళతారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

సీతమ్మధార, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు టీపీటీ కాలనీలో గల బృందావనం పార్కులో మంగళవారం వైసీపీ సంతకాలు సేకరించింది. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు విచ్చేసి విద్యార్థులు, మేధావులు, ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు వైసీపీ అధ్యక్షుడు గుడ్ల అశోక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

చిన్న పిల్లల్లో స్ట్రోక్ లక్షణాలు

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల్లోనూ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తున్నాయని భారతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరాలజీ ఫిజీషియన్ డాక్టర్ భారతి తెలిపారు. సంగం ఆఫీస్ జంక్షన్‌లోని ఆసుపత్రిలో మంగళవారం ఆర్ఎంపీలకు వైద్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆకలి లేకపోవడం, మందమతిగా ఉండడం, ఎక్కువ నీరసంగా కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉత్తరాంధ్ర ఆర్ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, మమ్ములు తిరుపతిరావు, గద్ద చిరంజీవి, ఆకుల శ్రీనివాసరావు, మట్టపర్తి గణేష్, లోగిస గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలపై దాడులు ఆపాలి

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనగణన, కులగణన చేపట్టాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి మంగళవారం జగదాంబ జంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించింది. జిల్లా కార్యదర్శి షేక్ రహమాన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై వివక్షతో దాడులు జరుపుతున్నారని ఉదాహరణలతో చెప్పారు. తెనాలిలో మైనారిటీ యువకులను సీఐ తీవ్రంగా కొట్టినా కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని ఆక్షేపించారు. దాడులు ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సుబ్బారావు, పైడిరాజు, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నవారికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం


చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గ పరిధిలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, ఆడబిడ్డ వివాహం, జీవనోపాధికి ఆటో మరమ్మతుల నిమిత్తం పలువురికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. హరీష్, బషీర్, రాజయ్య, జరినాబేగం, రితిక, సాహిల్ అనే వ్యక్తులకు మంగళవారం ఆర్థిక సహాయం అందచేశారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి నిరంతరం తన వంతు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి కార్పొరేటర్లు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో ప్రజా దర్బార్


వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల ఉత్తర నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశామన్నారు.

టీడీఆర్‌ల జారీకి కమిషనర్ ఆదేశం


అక్కయ్యపాలెంరోడ్డులో మసీదు వద్ద టీడీఆర్ ఇవ్వాల్సిన స్థల రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ప్రధానరహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయినవారికి టీడీఆర్ జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ కారణంగా దుకాణాలు కోల్పోయినా ఇంతవరకు టీడీఆర్ ఇవ్వలేదంటూ బాబా తాజుద్దీన్ అవులియా ఆశ్రమం(మసీదు) ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన టౌన్‌ప్లానింగ్ డీసీపీ రామ్మోహన్‌ను పిలిచి మసీదుకు సంబంధించిన ఆస్తి ఎంతవరకు కోల్పోయారు? వాటికి సంబంధించిన పత్రాలు, జీవీఎంసీ పన్ను చెల్లించారా? అనేదానిపై ఆరా తీశారు. మసీదు ప్రతినిధులు వాటికి సంబంధించిన రసీదులను తీసుకునిరాగా కమిషనర్ వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. టీడీఆర్ జారీ కోసం కమిటీకి సమర్పించేందుకు అన్ని వివరాలను అందజేయాలని, మిగిలిన బాధితులు ఎవరైనా ఉంటే వారికి సంబంధించిన టీడీఆర్‌ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు.

టేబుల్ టెన్నిస్ చాంప్స్‌గా విశాఖ, తూర్పు గోదావరి


విజేతలతో ముఖ్య అతిథి ఎల్‌బీసీ డీసీఎం శారదప్రసాద్ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీలో పురుషుల విభాగంలో ఆతిథ్య విశాఖ, మహిళల విభాగంలో తూర్పు గోదావరి జట్లు చాంపియన్ ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో అనంతపురం, మహిళల విభాగంలో విశాఖ రన్నరప్‌గా నిలిచాయి. వ్యక్తిగత ఈవెంట్ అండర్-19 బాలికల విభాగంలో మౌపర్ణదాస్, శ్రీకర లాస్య పమిడి...బాలుర విభాగంలో మహీధర వర్మ, చేతన్ సాయి పట్నాన; అండర్-17 బాలికల విభాగంలో మౌపర్ణదాస్, ఎస్.కె.ఆరిఫా సుల్తాన...బాలుర విభాగంలో సంవేద్ తేలప్రోలు, వేదాన్స్ నాదెళ్ల విన్నర్, రన్నరప్ స్థానాలు సాధించారు.

గీతం యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఈ పోటీలకు ఎల్‌బీసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీవీఎస్వై.శర్మ, కార్యదర్శి మురళి పాత్రో, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, శాప్ డైరెక్టర్ రాజా రమేష్, పర్యవేక్షకుడు అచ్యుత్ కుమార్ పాల్గొన్నారు. బుధవారం మరికొన్ని పోటీలు జరుగుతాయని జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు తెలిపారు.

రైల్వే రన్నింగ్ సిబ్బంది సంఘం నిరసన


ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే రన్నింగ్ సిబ్బంది కరువు భత్యం సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ యూనియన్ నిరసన దినాన్ని నిర్వహించింది. మర్రిపాలెం క్రూ లాబీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్ వంటి రన్నింగ్ సిబ్బందికి 50 శాతం వరకు పెంచాల్సిన కరువు భత్యం అలవెన్స్‌ను 25 శాతానికి పరిమితం చేయడం అన్యాయమన్నారు. రన్నింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఆర్‌వీఎస్ఎస్.రావు, పీజేజే.రాజు, ఎం.రాజేష్, పి.ఆదినారాయణ, ఎం.సన్యాసిరావు, దామోదర్ పాల్గొన్నారు.

కేసుల రాజీకి పోలీసులు చొరవచూపాలి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజీకి అవకాశం ఉన్న కేసుల విషయంలో పోలీసులు చొరవ చూపాలని జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన పోలీసు ఉన్నతాధికారుల సమావేశమయ్యారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో రాజీకాగలిన, ఎక్సైజ్, మోటారు వాహన ప్రమాదాలు, కుటుంబ న్యాయస్థానానికి సంబంధించి కేసులు రాజీకి కృషిచేయాలన్నారు. కక్షిదారులకు ముందుగా నోటీసులిచ్చి, సంబంధిత న్యాయవాదులతో మాట్లాడి పరిష్కరించుకునేందుకు సహకరించాలన్నారు. ఈ మేరకు గ్రామీణ, నగర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

మెరుగైన సేవలకు సహకరించాలి: సీపీ


కార్యాలయం ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సవాళ్లను అధిగమించడంతో పాటు సైబర్‌నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారుచేయాలని సొసైటీ ఫర్ విశాఖ సెక్యూరిటీ కౌన్సిల్ సొసైటీ ప్రతినిధులను సీపీ శంఖబ్రతబాగ్చి కోరారు. పోలీస్‌కమిషనరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రజలకు పోలీస్‌శాఖ తరఫున మెరుగైన సేవలు అందించడంతో పాటు సైబర్‌సెక్యూరిటీ, మహిళల భద్రత, చిన్నారుల హక్కుల పరిరక్షణ, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు సమర్థంగా అడ్డుకట్టవేసేందుకు ప్రణాళికలను తయారుచేయాలని కోరారు. యువత అభ్యున్నతికి పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను భాగస్వాములను చేయడం, సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించడం, సామాజిక భద్రతపై చైతన్యం కల్పించే కార్యక్రమాలను పోలీసులతో కలిసి నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీపీలు మణికంఠచందోలు, మేరీప్రశాంతి, ఏడీసీపీలు, సొసైటీ ప్రతినిధులు కృష్ణబాలాజీ, ధీరజ్ పాల్గొన్నారు.

మద్యం తాగాలని వేధిస్తున్నారు!

... 5వ పేజీ తరువాయి

ఏయూ వీసీ నెల రోజులు కిందట జరిగిన ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాలు, మద్యం వంటివి వర్సిటీకి దూరంగా ఉండేలా చేస్తామని స్పష్టం చేశారు.

సీఐఐ సదస్సుతో పెట్టుబడుల వరద

» టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి


టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న గండి బాబ్జి

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సీఐఐ సదస్సుతో రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు, 14 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండిబాబ్జి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 613 ఒప్పందాల ద్వారా వందల సంస్థలు విశాఖ చుట్టూ వస్తున్నాయని, ఇప్పుడు ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. వైసీపీ హయాంలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలలపై వైసీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని, రుషికొండపై ఖర్చు చేసిన డబ్బు వైద్య కళాశాలలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆరు నెలల్లో కొత్త రహదారులు అందుబాటులోకి వస్తాయన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టు మిషన్లు అందిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, యోగ కార్యక్రమాల నిర్వహణతోపాటు సాధారణ మహిళల స్వయం ఉపాధికి వృత్తి విద్యలలో ఉచిత శిక్షణ ఇస్తామని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగుద్గురు పీఠం) జాతీయ సలహా మండలి సభ్యుడు సీహెచ్ఎస్ఎన్ రాజు తెలిపారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇకె సంస్కృతి సదన్‌లో మంగళవారం జగుద్గురు పీఠం వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఇప్పటి వరకూ 2,020 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలలో రోజూ మూడువేల మందికి హోమియో వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం వృత్తి విద్యలలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.చంద్రశేఖర గురుప్రసాద్, ట్రస్ట్ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్, గణపతి, బి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, బి.ఉషారాణి, దాట్ల రాధ, గొల్లపూడి రవికుమార్, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడిద్దాం'

సీతంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరులో డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి భవన నిర్మాణ కార్మికులు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం జిల్లా భవన నిర్మాణ కార్మికుల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కోట సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టాన్ని (1996), పథకాలను అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గాలికొదిలేసి సమీక్షలు, సభలు పేరుతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు మరిచిపోయారన్నారు. సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన లక్ష్మణ, సంఘం గౌరవ అధ్యక్షుడు కూన కృష్ణరావు, నాయకులు ఎస్.సూర్యనారాయణ, కె.ఈశ్వరరావు, వైఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ డబ్బుల జమ నేడు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకం రెండో విడత నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమ చేయనున్నారు. అర్హులైన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల వంతున, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.రెండు వేలు విడు దల చేయనున్నాయి. జిల్లాలోని నాలుగు మండలాల్లో (ఆనందపురం,భీమిలి, పద్మ నాభం, పెందుర్తి) 18 వేలమంది రైతులకు సుమారుగా రూ.12.5 కోట్లు అందనున్నట్టు అధికారులు తెలిపారు.

పెట్రోలియం వర్సిటీ రెడీ

... 5వ పేజీ తరువాయి

ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ వర్సిటీని రాష్ట్రానికి కేటాయించగా, 2016 నుంచి ఏయూలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పెట్రోలియం ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

గృహ రేటింగ్ సాధించేలా..

వాతావరణానికి హాని కలిగించకుండా, సహజ వనరులను సద్వినియోగం చేసుకునే విధంగా ఉండే భవన నిర్మాణాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హాబిటేట్ అసెస్‌మెంట్ (గృహ) పేరుతో రేటింగ్స్ ఇస్తోంది. గృహ రేటింగ్ 4 సాధించేలా పెట్రోలియం వర్సిటీ భవన నిర్మాణాలను పూర్తిచేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, వినియోగించిన నీరు రీసైక్లింగ్ చేసే టెక్నాలజీ, తరగతి గదులు, ఇతర హాల్స్‌లోకి వెంటిలేషన్ వచ్చేలా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై వర్సిటీ అధికారులు మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు నాలుగు వారాలు సెలవులు ఉంటాయని, అనంతరం నేరుగా నూతన క్యాంపస్‌లోకి వస్తారన్నారు.

మళ్లీ హెలీ టూరిజం

... 5వ పేజీ తరువాయి

వ్యయంతో ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ నిర్మించింది. దీనిని సద్వినియోగం చేయాలని పర్యాటక శాఖ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. కార్డిలియో గ్రూపు ప్రతినిధులను తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడించింది. కాకినాడ-విశాఖపట్నం-భీమిలి మధ్య ఒక క్రూయిజ్ నడపాలని ప్రభుత్వం కోరింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. ఇది కాకుండా శాండీ క్రూయిజ్ ప్రైవేటు లిమిటెడ్ రూ.250 కోట్లతో క్రూయిజ్ మెరైన్ పెట్టడానికి ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

గోల్ఫ్ కోర్సులు

విశాఖపట్నంలో ముడసర్లోవ పార్కు పక్కనే ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఉంది. నేవీ అధికారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. పెద్ద మొత్తంలో భూములు అవసరమయ్యే ఈ ప్రాజెక్టులకు పెట్టుబడులు పెట్టడానికి చాలామంది ముందుకు వచ్చారు. భోగాపురం, భీమిలి పరిసరాల్లో వీటికి భూములు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఫ్లానెక్స్ రీసైక్లింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ గోల్ఫ్ కోర్సుతో పాటు రిసార్ట్ కూడా పెడతామని ముందుకు వచ్చింది. రూ.400 కోట్ల పెట్టుబడి పెట్టి, 4,200 మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. సన్‌విక్ గోల్ఫ్ అనే సంస్థ రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టి 1,350 మందికి ఉద్యోగాలు ఇస్తామని ఎంఓయూ చేసింది.

శబరిమల రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)కు కూడా అంతే డిమాండ్ నెలకొంది. వీటితోపాటు రోజూ నడిచే డిబ్రుగర్-నాగర్‌కోయిల్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504)లో జనవరి 16 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

వారాంతపు రైళ్లకు డిమాండ్

వివిధ ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా ఎర్నాకులం చేరే వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనవరి 16 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి గురువారం నడిచే షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) జనవరి 15 వరకు, ప్రతి సోమ, బుధవారం అందుబాటులో ఉండే షాలిమార్-త్రివేండ్ర ఎక్స్‌ప్రెస్ (22642) జనవరి 14 వరకు, ప్రతి శుక్ర, శనివారం నడిచే పాట్నా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (22644) జనవరి 9 వరకు, ప్రతి శనివారం అందుబాటులో ఉండే సిల్చార్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్‌కు (12508) జనవరి 3 వరకు, ప్రతి మంగళవారం నడిచే హటియా-ఎర్నాకులం ధ్రాత్రి అబ్బా ఎక్స్‌ప్రెస్ (22837)లో జనవరి 6 వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఉంది.

శ్రీకాకుళం, కొల్లాం ప్రత్యేక రైలుపై వినతి

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం వాల్తేరు రైల్వే అధికారులు 2023లో శ్రీకాకుళం-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడిపారు. ఈ ఏడాది అయ్యప్ప మాలధారుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గతంలో మాదిరిగా శ్రీకాకుళం రోడ్డు, కొల్లాం మధ్య ప్రవేశపెట్టాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

మహా విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

భూమి/పార్కు/గెడ్డ/భవనానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవడం, కబ్జా చేసి నిర్మాణం చేపట్టడం చేస్తే ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పోలీసులకు లేదంటే టౌన్‌ప్లానింగ్ అధికారులకు అందజేసి పరిరక్షించాల్సిన బాధ్యత ఎస్టేట్ అధికారిపైనే ఉంటుంది. అలాగే చీఫ్ సిటీప్లానర్, కమిషనర్ వంటి ఉన్నతాధికారులకు ఏదైనా భూమికి సంబంధించిన అంశంపై సందేహం తలెత్తినా, ఫిర్యాదులు అందినా రికార్డులను పరిశీలించి వివరాలను వివరించాల్సిన బాధ్యత కూడా ఎస్టేట్ అధికారిపైనే ఉంటుంది. అందుకే ఎస్టేట్ అధికారి పోస్టులో భూ వ్యవహారాలు, వివాదాల పరిష్కారంలో అనుభవం కలిగిన సీనియర్ తహశీల్దార్ స్థాయి అధికారిని నియమిస్తుంటారు.

ఎస్టేట్ అధికారి ఉండగానే మరొకరు!

కానీ ఏం జరిగిందో తెలియదుగానీ తహశీల్దార్ స్థాయి అధికారిణి ఎస్టేట్ అధికారిగా ఉన్నప్పటికీ అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న ఒక అధికారిని తీసుకొచ్చి రెండో ఎస్టేట్ అధికారిగా నియమించారు. ఒకవేళ పనిఒత్తిడో, మరో కారణం చేతనో రెండో ఎస్టేట్ అధికారి అవసరమని భావించినా, భూవ్యవహారాలపై అవగాహన ఉన్న రెవెన్యూ శాఖ నుంచి మాత్రమే నియమించుకోవాలి.కానీ అందుకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారు. కొద్దినెలల కిందట డిప్యూటేషన్‌పై వచ్చినప్పటికీ ఈ విషయం బయటకు పొక్కలేదు. ఎస్టేట్ అధికారిగా ఉన్న రెవెన్యూ అధికారిణికి అధికారులు సైతం ప్రాధాన్యం ఇవ్వకుండా అగ్నిమాపక శాఖ నుంచి వచ్చిన అధికారికే ప్రాధాన్యం ఇసున్నారు. తాజాగా కొంతమంది టౌన్ సర్వేయర్లతో సదరు అధికారి దురుసుగా వ్యవహరిస్తుండడంతో అగ్నిమాపక శాఖ అధికారి ఎస్టేట్ అధికారిగా నియమితులయ్యారనే విషయం బయటకు వచ్చింది. ఈ విషయం గురించి జీవీఎంసీ అధికారులతోపాటు కార్పొరేటర్లు సైతం ఉన్నతాధికారి వద్ద ప్రస్తావించగా, రాజకీయ పలుకుబడితో వచ్చారని సమాధానం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అగ్నిమాపకశాఖ అధికారి జీవీఎంసీకి చెందిన విలువైన భూములు అన్యాక్రాంతం అయితే ఎలా గుర్తిస్తారు, వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి నివేదిక తయారుచేయాలి? ఎవరికి అందజేయాలనేది ఎలా తెలుస్తుందని విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి. 13వ వార్డు కార్పొరేటర్ సునీత, పాల్గొన్న పలువురు కూటమి నేతలు

ఆరిలోవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీతాసత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో యూజీడీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు వృథాపై నిర్లక్ష్యం



వాల్వ్ బిగించకపోవడంతో వృథాగా పోతున్న నీరు

ఆరిలోవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీ ఎంసీ 12వ వార్డులో గల నర్సరీ వద్ద పెద్ద నీటిదార వృథాగా పోతున్నది. ఈ నీటిని పట్టుకోవడానికి వాటర ట్యాంకు వారు ట్యాంకును నింపి నీటి వాల్వు బంద్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నీరు వృథా పోతున్నది. ఈ నీరంతా నర్సరీ ప్రాంతంలోకి వృథాగా పోతున్నది. దీన్ని అరికట్టకపోవడం వల్ల వేలాది లీటర్ల నీరు నేల పాలవుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సముద్రంలో మత్స్యకారుడి మృతి



లక్ష్మణరావు (ఫైల్ ఫొటో)

బీచ్ రోడ్డు, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు సముద్రంలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. సహచరులు 9 మందితో కలిసి జాలారిపేటకు మేరుగు లక్ష్మణ్‌రావు (37) నాలుగు రోజుల కిందట బోటుపై వేటకు వెళ్లాడు. తీరానికి సుమారు వంద నాటికల్ మైళ్ల దూరంలో వేట చేస్తుండగా సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో బోటుకు లంగరు వేశారు. ఆ సమయంలో లక్ష్మణరావు కాలుకు లంగరు తాడు చుట్టుకుపోవడంతో అదుపుతప్పి సముద్రంలో పడిపోయాడు. అతడిని రక్షించడానికి సహచరులు తీవ్ర ప్రయత్నం చేశారు. కొంత సమయం తరువాత వెలికితీశారు. అప్పటికే అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని ఫిషింగ్ హార్బర్‌కు తీసుకువచ్చారు. లక్ష్మణరావు మృతితో జాలారిపేటలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబానికి పెద్దదిక్కు లేకపోవడంతో భార్య పద్మావతి, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒన్‌టౌన్ సీఐ వరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వచ్చే నెల 13న నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వేడుకలకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి సతీమణి సుధా నారాయణమూర్తి హాజరుకానున్నారు. ఈ మేరకు సంఘం వివరాలను వెల్లడించింది. ఏటా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తు న్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రంధి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏటా వేడుకలను నిర్వహిస్తు న్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రిస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల ఫ్రండ్** :శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక).

అన్నసమారాధన

పెదవాల్తేరు. నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని పెద వాల్తేర్‌లో గల వేంకటేశ్వర దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పునియోజక వర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు, టీడీపీ యువనేత వెలగపూడి ప్రతాప రుద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్నిప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డన చేశారు, ఆయనతో పాటు దశరథరామయ్య, పోతన రెడ్డి, పీతల అఖిల దేవుడుబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 40, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 60, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 56, బీరకాయలు 54, ఆనపకాయ 36, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 27, క్యారెట్ 56, దొండకాయలు 62, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 52, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60,కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడుచిక్కుడు 74, గోరుచిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు	బ్రాయిలర్
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

మహిళా భద్రతకు కలిసి పనిచేయాలి

- విశాఖలో అమలయ్యే విధానాలు ఆదర్శం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



సదస్సు ప్రారంభిస్తున్న రాయపాటి శైలజ

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రజలంతా కలిసి పనిచేయాలని, ఇది ఒక వ్యక్తి, వ్యవస్థపై ఆధారపడి ఉండదని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఏయూలో మంగళవారం 'సస్టైనింగ్ విమెన్- బెంచ్ మార్కింగ్ విశాఖపట్నం సక్సెస్ అండ్ ఫ్యూచర్ - ప్రూఫింగ్ గవర్నెన్స్' అంశంపై మహిళా కమిషన్, ఏయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

జాతీయస్థాయిలో మహిళా భద్రతపై నిర్వహించిన నారీ-2025 ఇండెక్స్‌లో జాతీయ స్థాయిలో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విశాఖ మహిళా భద్రతకు సురక్షితంగా నిలవడంపై అభినందించారు. సీఎం చంద్రబాబు సైతం అనేక సందర్భాల్లో విశాఖ ఎంతో సేఫ్ సిటీ అని చెప్పారన్నారు. మహిళల భద్రత కోసం ఇక్కడి విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ శారీరక భద్రత మాత్రమే కాదని, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించడం కూడా అన్నారు. విద్యతోనే ప్రతి మహిళకు పూర్తిస్థాయిలో భద్రత, భరోసా లభిస్తాయన్నారు. మహిళా సాధికారితకు ముందడుగు వేసేలా స్త్రీశక్తి పథకం నిలుస్తోందన్నారు. వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేశామని, మహిళల సమస్యలకు సూచనలు, సలహాలు, సహాయం అందిస్తామన్నారు. మూడు ప్రాంతాల్లో రూ.150 కోట్లతో వర్కింగ్ విమెన్స్ హాస్టల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళా విద్యా ర్థులకు భద్ర త కల్పించేలా మహిళా సెక్యూరిటీ గార్డులను నియమించా మ న్నారు. ఆరోగ్య సమాజం మహిళల భద్రతతోనే సాకారమవుతుం దన్నారు.విద్యార్థి విభాగంలో అసోసియేట్ డీన్‌గా మహి ళను నియమించామని, మూడు కీలకమైన డీన్ పోస్టులు, మూడు కళాశాలలకు ప్రిన్సిపాల్స్ మహిళలేనన్నారు. త్వరలో ఒక అధ్యయనం చేసి పాలసీ డాక్యుమెం ట్‌ను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళలకు భద్రత కల్పిం చే కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలే పోలీసులకు కళ్లు, చెవులు అన్నారు. మహిళలపై ఆన్‌లైన్ నేరాలు, వేధింపులు, అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు.

దుర్గాభాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్య యన కేంద్రం సంచాలకురాలు ప్రొఫెసర్ ఎ.పల్లవి సదస్సు నిర్వహణ, ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ అధికారులు, ఉద్యోగు లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- నషా ముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని అస్తవ్యస్తంగా మార్చి, కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాల జోలికిపోవద్దని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రి త్వశాఖ ఆధ్వ ర్యంలో ప్రారంభించిన నషా ముక్త అభియాన్ కార్యక్రమానికి ఐదేళ్లు పూర్తైన సందర్భంగా ఆశాఖ మంత్రి వీరేంద్ర కుమార్ మంగళవారం అమృత్‌సర్ నుం చి వర్చువల్‌గా వివిధ రాష్ట్రాల యువ తను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ సందేశాన్ని చదివి వినిపించారు. ఏయూలోని ఎంవీఎస్ మూర్తి ఆడిటో రియంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లా డుతూ మాదక ద్రవ్య రహితంగా విశాఖను తీర్చిదిద్దే మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఐదేళ్లలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని, యువతలో చైతన్యం తీసుకువచ్చామన్నారు. డీ అడిక్షన్ సెంటర్ల ఆవశ్యకతను వివరించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ యువత మాద కద్రవ్యా లతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. నగరంలో ఎవరైనా తీవ్ర సమస్యలతో బాధపడితే డీ అడిక్షన్ కేంద్రాలను సంప్రదించాలని ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972, సీపీ వాట్సాప్ నంబరు 7005095799 గాని సంప్రదించాలన్నారు. అనంతరం ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) జోనల్ డైరెక్టర్ పంకజ్‌కుమార్ ద్వివేదీ మాట్లాడారు.కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సం క్షేమ శాఖ అసిస్టెం ట్ డైరెక్టర్ కవిత, అధికారులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కేపీ నాయుడు



విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది కేపీ నాయుడు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీచేశారు. కేపీ నాయుడు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఏయూ న్యాయకశాలలో చదివిన నాయుడు 2009లో న్యాయవాది వృత్తిని చేపట్టారు.

కేపీ నాయుడు నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నరసింగరావు, బైపా అరుణ్‌కుమార్, కె.రామయోగేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ అభినందించారు.

ఏయూ తెలుగుశాఖలో గ్రంథావిష్కరణలు



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న వివిధ విభాగాల ఆచార్యులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సమావేశ మందిరంలో మంగళవారం మూడు గ్రంథాలను ఆవిష్కరించారు. శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ జర్రా అప్పారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో బాల సుధాకర్ రాసిన సందువ గ్రంథాన్ని ప్రొఫెసర్ గుజ్జా యోహాన్‌బాబు ఆవిష్కరించగా, అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎంఎన్ కృష్ణవేణి సమీక్షించారు. బాల సుధాకరమౌళి రాసిన యుద్ధంలో గ్రంథాన్ని ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న ఆవిష్కరించగా, భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వము గ్రంథాన్ని ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సందువ కవిత్వం శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అణగారిన వర్గాల జీవితాన్ని, ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలు ప్రస్తావించిందన్నారు. చేపల్లో ఒకదాని పేరు సందువ ఆ పేరును గ్రంథానికి పెట్టడం బాగుందన్నారు. యుద్ధం కవితా సంపుటిలో కుల, మత వ్యవస్థలపై చర్చించిన రచయిత ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ తెలుగు శాఖలో పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. యోహానుబాబు మాట్లాడుతూ బాల సుధాకర్ మత్స్యకారుల జీవిత చిత్రాన్ని మత్స్యకారుల కళింగ జీవితాన్ని చక్కగా ఆవిష్కరించారన్నారు. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న మూడు గ్రంథాల్లో సామాజిక చైతన్యం ప్రతిబింబిస్తోందన్నారు.

20 రోజుల్లో 'స్వర్ణభారతి' పూర్తిచేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం



స్వర్ణభారతి స్టేడియం పునర్నిర్మాణపనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం పునర్నిర్మాణపనులను 20రోజుల్లోగా పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన పనులు పరిశీలించారు. పరిసరాల్లో డెబ్రిస్ పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాదిన్నరగా పునర్నిర్మాణపనులు కొనసాగిస్తుండడంపై కాంట్రాక్టర్‌తోపాటు పనులను పర్యవేక్షిస్తున్న ఏపీయూఎంఎల్ ప్రతినిధులపై అసంతృప్తివ్యక్తంచేశారు. 20 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలోని వాసవానిపాలెం, శివగణేష్‌నగర్‌లో ఉంటున్న వంక నందిని(20) ఈ నెల 14 నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఆమె తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు చేసింది. కొన్ని రోజులుగా భర్తతో విభేదాలతో తన ఇద్దరి పిల్లలతో తమ ఇంటికి వచ్చిందని, ఈ నెల 14 రాత్రి నుంచి ఆమె కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియలేదని పేర్కొన్నారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ ప్రత్యేక తనిఖీల్లో చలానాల మోత

- ఆర్టీవో, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఆర్టీవో గోవిందరావు, ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ ఉల్లంఘనలు అరికట్టేందుకు మంగళవారం మద్దిలపాలెం కూడలిలో ఆర్టీవో, ట్రాఫిక్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీవో గోవిందరావు, ట్రాఫిక్ ఎస్ఐ జోగిరాజు ఆధ్వర్యంలో వాహనాల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలానాల మోతా మోగించారు. నిబంధనలు పాటించని వాహనాదారులపై కేసులు నమోదు చేసి కొత్త చలానాలు విధించారు. హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు రూ.1000, లైసెన్స్ లేని వాహనదారులకు బైక్ సీజ్‌తో పాటు రూ.5 వేలు ఫైన్ వేశారు. సెల్‌ఫోన్, ట్రిపుల్ డ్రైవింగ్‌లపై కొరడా ఝుళిపించారు. ఆటోలు, కార్లు, వ్యాన్‌లు, బైక్‌లను నిలిపి పెండింగ్ చలానాలు చెక్ చేశారు. చలానా పెండింగ్ వాహనాలకు చలానాలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. భారీ చలానాల వల్ల ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గుతాయన్నారు. సురక్షిత ప్రయాణానికి నియమ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులదే కీలక పాత్ర

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత



ప్రతిజ్ఞ చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థులదే కీలక పాత్రని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన నషా ముక్త భారత్ అభియన్ కార్యక్రమంలో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడమే కాకుండా, వాటివల్ల కలిగే దుష్పలితాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, కొకైన్, ఓపియం, హెరాయిన్, నార్కోటిక్స్ డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు వినియోగించి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు ఆర్వీ నాయుడు, మురళీకృష్ణ, సూన్య కుమారి, బాలమురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు సంస్మరణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి బి.ఆనందరావు, వివిధ గ్రంథాలయ శాఖల నుంచి అధికారులు కె.రాములు, పి.మల్లేశ్వరరావు, బి.పైడిరాజు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి వక్తలు గ్రంథాలయాల ప్రయోజనం, గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన, ఉద్యమించిన మహనీయుల గురించి ప్రసంగించారు.

జేఆర్ నగర్‌లో రహదారి పక్కన చెత్తనిల్వలు



ప్రధాన మార్గంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు జేఆర్‌నగర్‌లో ప్రధాన మార్గంలో రోడ్డుపై చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఈ మార్గంలో నడిచే పాదచారులతో పాటు వాహనచోదకులు కూడా దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రతలో జాతీయ స్థాయిలో అవార్డు పొందిన కాలనీలో ఇటువంటి చెత్త నిల్వలు ఉండడం పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చెత్తను తొలగించి, రోడ్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు మాయం

ఎంవీపీ కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చిన మహిళ మెడలో బంగారు గొలుసు మాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 16న రాత్రి చన్నయేశ్వరి తన అత్తను వెంకోజీపాలెం వద్ద గల మెడికవర్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఈసీజి పరీక్ష పూర్తయ్యాక చూసుకునే సరికి ఆమె మెడలోని సుమారు 28 గ్రాముల బంగారు గొలుసు మాయమయింది. వెంటనే ఆస్పత్రి సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోవడంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

పెందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగి వున్న టిప్పర్‌ను ఢీట్టిన ఘటనలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుని ఆరుగంటలు నరకయాతన అనుభవించాడు. ఈ సంఘటన రాంపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం నుంచి ఫ్లయాష్ లోడుతో లారీ పద్మనాభం బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజాము 5గంటలకు రాంపురం వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. క్యాబిన్‌లో డ్రైవర్ సాయి (40) చిక్కుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయకచర్యలు చేపట్టి ఆరు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకోజిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం శ్రీ గౌరీజ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో వేంచేసి యున్న నాగదేవత, శివుడు సమేతంగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరి మంగళవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని విశేష అభిషేకాలు చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార. పసుపు, కుంకుమ, విభూది, పుష్పాలు, రోజ్‌వాలు, తదితర వాటితో స్వామి వారిని భక్తులు స్వయంగా అభిషేకం జరిపారు.

భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. భక్తుల రద్దీతో ఆలయం వద్ద రద్దీ నెలకొంది.



ర్యాలీలో పాల్గొన్న మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినులు



ర్యాలీలో పాల్గొన్న సెయింట్ జోసెఫ్ విద్యార్థినులు


ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

» చైతన్య ర్యాలీల్లో నినదించిన విద్యార్థులు, అతిథులు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు తీసుకుంటే యువత జీవితం నాశనమవుతుందని వక్తలు హెచ్చరించారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్య రహిత భారత్ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మంగళవారం డాబాగార్డెన్స్, జ్ఞానాపురం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులు, పోలీసులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఆర్.మంజుల ప్రారంభించారు. ర్యాలీలో వాలంటీర్లు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ ఆర్.మంజుల మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.జె.లావణ్య, డా.బి.హైమావతి పాల్గొన్నారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి నేతృత్వంలో ప్లకార్డులు పట్టుకొని విద్యార్థినులు ర్యాలీలో నినదించారు. అనంతరం కళాశాలలో వక్తృత్వం, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం జరిగింది. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తులు, కుటుంబాలు, యువత జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్న పరిస్థితులను వివరించారు. విద్యార్థులతోపాటు వారి కుటుంబాలు, స్నేహితులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలకృష్ణ, నాల్గో పట్టణ పోలీసులు, ఎన్‌సీసీ అధికారి ఎంఎన్‌వీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి రాష్ట్ర అంచనాల కమిటీ పర్యటన

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ ఈ నెల 26 నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నట్లు ఏపీ లెజిస్లేటివ్ సెక్రటరీ జనరల్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, బండారు సత్యానందరావు, కందుల నారాయణరెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్థసారధి, సునీల్‌కుమార్, సాంబశివరావు, సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణిలతో కూడిన కమిటీ 25న రాత్రికి విశాఖ చేరుకుంటుంది. 26న సింహాచలంలో దేవదాయ శాఖ అధికారులతోనూ, అనంతరం కలెక్టరేట్‌లో సమావేశాలు నిర్వహిస్తారు. రాత్రికి విజయనగరం సమీపంలోని రామనారాయణం సందర్శిస్తారు. 27న విజయనగరం పైడితల్లి అమ్మవారి దర్శనం తరువాత జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. 28న అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనం అనంతరం శ్రీకాకుళం జిల్లా అధికారులతో సమావేశమై అక్కడ నుంచి విజయవాడ తిరిగి వెళతారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

సీతమ్మధార, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు టీపీటీ కాలనీలో గల బృందావనం పార్కులో మంగళవారం వైసీపీ సంతకాలు సేకరించింది. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు విచ్చేసి విద్యార్థులు, మేధావులు, ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు వైసీపీ అధ్యక్షుడు గుడ్ల అశోక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

చిన్న పిల్లల్లో స్ట్రోక్ లక్షణాలు

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల్లోనూ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తున్నాయని భారతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరాలజీ ఫిజీషియన్ డాక్టర్ భారతి తెలిపారు. సంగం ఆఫీస్ జంక్షన్‌లోని ఆసుపత్రిలో మంగళవారం ఆర్‌ఎంపీలకు వైద్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆకలి లేకపోవడం, మందమతిగా ఉండడం, ఎక్కువ నీరసంగా కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉత్తరాంధ్ర ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, మమ్ములు తిరుపతిరావు, గద్ద చిరంజీవి, ఆకుల శ్రీనివాసరావు, మట్టపర్తి గణేష్, లోగిస గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలపై దాడులు ఆపాలి

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనగణన, కులగణన చేపట్టాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి మంగళవారం జగదాంబ జంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించింది. జిల్లా కార్యదర్శి షేక్ రహమాన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలపై వివక్షతో దాడులు జరుపుతున్నారని ఉదాహరణలతో చెప్పారు. తెనాలిలో మైనారిటీ యువకులను సీఐ తీవ్రంగా కొట్టినా కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోలేదని ఆక్షేపించారు. దాడులు ఆపకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సుబ్బారావు, పైడిరాజు, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నవారికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

సీతంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గ పరిధిలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, ఆడబిడ్డ వివాహం, జీవనోపాధికి ఆటో మరమ్మతుల నిమిత్తం పలువురికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. హరీష్, బషీర్, రాజయ్య, జరినాబేగం, రితిక, సాహిల్ అనే వ్యక్తులకు మంగళవారం ఆర్థిక సహాయం అందచేశారు. సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి నిరంతరం తన వంతు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి కార్పొరేటర్లు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బీజేపీ కార్యాలయంలో ప్రజా దర్బార్

సీతమ్మధార, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల ఉత్తర నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశామన్నారు.


వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

టీడీఆర్‌ల జారీకి కమిషనర్ ఆదేశం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ప్రధానరహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయినవారికి టీడీఆర్ జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ కారణంగా దుకాణాలు కోల్పోయినా ఇంతవరకు టీడీఆర్ ఇవ్వలేదంటూ బాబా తాజుద్దీన్ అవులియా ఆశ్రమం(మసీదు) ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన టౌన్‌ప్లానింగ్ డీసీపీ రామ్మోహన్‌ను పిలిచి మసీదుకు సంబంధించిన ఆస్తి ఎంతవరకు కోల్పోయారు? వాటికి సంబంధించిన పత్రాలు, జీవీఎంసీ పన్ను చెల్లించారా? అనేదానిపై ఆరా తీశారు. మసీదు ప్రతినిధులు వాటికి సంబంధించిన రసీదులను తీసుకునిరాగా కమిషనర్ వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. టీడీఆర్ జారీ కోసం కమిటీకి సమర్పించేందుకు అన్ని వివరాలను అందజేయాలని, మిగిలిన బాధితులు ఎవరైనా ఉంటే వారికి సంబంధించిన టీడీఆర్‌ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు.


అక్కయ్యపాలెంరోడ్డులో మసీదు వద్ద టీడీఆర్ ఇవ్వాల్సిన స్థల రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

టేబుల్ టెన్నిస్ చాంప్స్‌గా విశాఖ, తూర్పు గోదావరి


విజేతలతో ముఖ్య అతిథి ఎల్ఐసీ డీసీఎం శారదప్రసాద్ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీలో పురుషుల విభాగంలో ఆతిథ్య విశాఖ, మహిళల విభాగంలో తూర్పు గోదావరి జట్లు చాంపియన్ ట్రోఫీలు కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో అనంతపురం, మహిళల విభాగంలో విశాఖ రన్నరప్‌గా నిలిచాయి. వ్యక్తిగత ఈవెంట్ అండర్-19 బాలికల విభాగంలో మౌపర్ణదాస్, శ్రీకర లాస్య పమిడి...బాలుర విభాగంలో మహీధర వర్మ, చేతన్ సాయి పట్నాన; అండర్-17 బాలికల విభాగంలో మౌపర్ణదాస్, ఎస్.కె.ఆరిఫా సుల్తాన...బాలుర విభాగంలో సంవేద్ తేలప్రోలు, వేదాన్ష్ నాదెళ్ల విన్నర్, రన్నరప్ స్థానాలు సాధించారు.

గీతం యూనివర్సిటీలో మంగళవారం జరిగిన ఈ పోటీలకు ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదాప్రసాద్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ, కార్యదర్శి మురళి పాత్రో, సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్, శాప్ డైరక్టర్ రాజా రమేష్, పర్యవేక్షకుడు అచ్యుత్ కుమార్ పాల్గొన్నారు. బుధవారం మరికొన్ని పోటీలు జరుగుతాయని జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు తెలిపారు.

రైల్వే రన్నింగ్ సిబ్బంది సంఘం నిరసన


ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే రన్నింగ్ సిబ్బంది కరువు భత్యం సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ యూనియన్ నిరసన దినాన్ని నిర్వహించింది. మర్రిపాలెం క్రూ లాబీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్ వంటి రన్నింగ్ సిబ్బందికి 50 శాతం వరకు పెంచాల్సిన కరువు భత్యం అలవెన్స్‌ను 25 శాతానికి పరిమితం చేయడం అన్యాయమన్నారు. రన్నింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఆర్‌వీఎస్‌ఎస్.రావు, పీజేజే.రాజు, ఎం.రాజేష్, పి.ఆదినారాయణ, ఎం.సన్యాసిరావు, దామోదర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు సహకరించాలి: సీపీ


కార్యాలయం ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సవాళ్లను అధిగమించడంతో పాటు సైబర్‌నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారుచేయాలని సొసైటీ ఫర్ విశాఖ సెక్యూరిటీ కౌన్సిల్ సొసైటీ ప్రతినిధులను సీపీ శంఖబ్రతబాగ్చి కోరారు. పోలీస్‌కమిషనరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన సొసైటీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రజలకు పోలీస్‌శాఖ తరఫున మెరుగైన సేవలు అందించడంతో పాటు సైబర్‌సెక్యూరిటీ, మహిళల భద్రత, చిన్నారుల హక్కుల పరిరక్షణ, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు సమర్థంగా అడ్డుకట్టవేసేందుకు ప్రణాళికలను తయారుచేయాలని కోరారు. యువత అభ్యున్నతికి పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను భాగస్వాములను చేయడం, సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించడం, సామాజిక భద్రతపై చైతన్యం కల్పించే కార్యక్రమాలను పోలీసులతో కలిసి నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీపీలు మణికంఠచందోలు, మేరీప్రశాంతి, ఏడీసీపీలు, సొసైటీ ప్రతినిధులు కృష్ణబాలాజీ, ధీరజ్ పాల్గొన్నారు.

కేసుల రాజీకి పోలీసులు చొరవచూపాలి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజీకి అవకాశం ఉన్న కేసుల విషయంలో పోలీసులు చొరవ చూపాలని జిల్లా న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. న్యాయసేవాప్రాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన పోలీసు ఉన్నతాధికారుల సమావేశమయ్యారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో రాజీకాగలిన, ఎక్సైజ్, మోటారు వాహన ప్రమాదాలు, కుటుంబ న్యాయస్థానానికి సంబంధించి కేసులు రాజీకి కృషిచేయాలన్నారు. కక్షిదారులకు ముందుగా నోటీసులిచ్చి, సంబంధిత న్యాయవాదులతో మాట్లాడి పరిష్కరించుకునేందుకు సహకరించాలన్నారు. ఈ మేరకు గ్రామీణ, నగర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

మద్యం తాగాలని వేధిస్తున్నారు!

... 5వ పేజీ తరువాయి

ఏయూ వీసీ నెల రోజులు కిందట జరిగిన ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాలు, మద్యం వంటివి వర్సిటీకి దూరంగా ఉండేలా చేస్తామని స్పష్టం చేశారు.

సీఐఐ సదస్సుతో పెట్టుబడుల వరద

» టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సీఐఐ సదస్సుతో రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు, 14 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండిబాబ్జి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 613 ఒప్పందాల ద్వారా వందల సంస్థలు విశాఖ చుట్టూ వస్తున్నాయని, ఇప్పుడు ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. వైసీపీ హయాంలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలలపై వైసీపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని, రుషికొండపై ఖర్చు చేసిన డబ్బు వైద్య కళాశాలలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆరు నెలల్లో కొత్త రహదారులు అందుబాటులోకి వస్తాయన్నారు.


టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న గండి బాబ్జి

కుట్టుమిషన్ల పంపిణీ

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, యోగ కార్యక్రమాల నిర్వహణతోపాటు సాధారణ మహిళల స్వయం ఉపాధికి వృత్తి విద్యలలో ఉచిత శిక్షణ ఇస్తామని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగుద్గురు పీఠం) జాతీయ సలహా మండలి సభ్యుడు సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు తెలిపారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇకె సంస్కృతి సదన్‌లో మంగళవారం జగుద్గురు పీఠం వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఇప్పటి వరకూ 2,020 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలలో రోజూ మూడువేల మందికి హోమియో వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం వృత్తి విద్యలలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.చంద్రశేఖర గురుప్రసాద్, ట్రస్ట్ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్, గణపతి, బి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, బి.ఉషారాణి, దాట్ల రాధ, గొల్లపూడి రవికుమార్, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు అందిస్తున్న అతిథులు

'డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడిద్దాం'

సీతంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబరులో డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి భవన నిర్మాణ కార్మికులు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం జిల్లా భవన నిర్మాణ కార్మికుల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కోట సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టాన్ని (1996), పథకాలను అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గాలికొదిలేసి సమీక్షలు, సభలు పేరుతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు మరిచిపోయారన్నారు. సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోన లక్ష్మణ, సంఘం గౌరవ అధ్యక్షుడు కూన కృష్ణరావు, నాయకులు ఎన్.సూర్యనారాయణ, కె.ఈశ్వరరావు, వైఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ డబ్బుల జమ నేడు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకం రెండో విడత నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమ చేయనున్నారు. అర్హులైన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల వంతున, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.రెండు వేలు విడు దల చేయనున్నాయి. జిల్లాలోని నాలుగు మండలాల్లో (ఆనందపురం,భీమిలి, పద్మ నాభం, పెందుర్తి) 18 వేలమంది రైతులకు సుమారుగా రూ.12.5 కోట్లు అందనున్నట్టు అధికారులు తెలిపారు.

పెట్రోలియం వర్సిటీ రెడీ

... 5వ పేజీ తరువాయి

ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ వర్సిటీని రాష్ట్రానికి కేటాయించగా, 2016 నుంచి ఏయూలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పెట్రోలియం ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

గృహ రేటింగ్ సాధించేలా..

వాతావరణానికి హాని కలిగించకుండా, సహజ వనరులను సద్వినియోగం చేసుకునే విధంగా ఉండే భవన నిర్మాణాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హాబిటేట్ అసెస్‌మెంట్ (గృహ) పేరుతో రేటింగ్స్ ఇస్తోంది. గృహ రేటింగ్ 4 సాధించేలా పెట్రోలియం వర్సిటీ భవన నిర్మాణాలను పూర్తిచేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, వినియోగించిన నీరు రీసైక్లింగ్ చేసే టెక్నాలజీ, తరగతి గదులు, ఇతర హాల్స్‌లోకి వెంటిలేషన్ వచ్చేలా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై వర్సిటీ అధికారులు మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు నాలుగు వారాలు సెలవులు ఉంటాయని, అనంతరం నేరుగా నూతన క్యాంపస్‌లోకి వస్తారన్నారు.

మళ్లీ హెలీ టూరిజం

... 5వ పేజీ తరువాయి

వ్యయంతో ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ నిర్మించింది. దీనిని సద్వినియోగం చేయాలని పర్యాటక శాఖ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. కార్డిలియో గ్రూపు ప్రతినిధులను తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడించింది. కాకినాడ-విశాఖపట్నం-భీమిలి మధ్య ఒక క్రూయిజ్ నడపాలని ప్రభుత్వం కోరింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. ఇది కాకుండా శాండ్ క్రూయిజ్ ప్రైవేటు లిమిటెడ్ రూ.250 కోట్లతో క్రూయిజ్ మెరైన్ పెట్టడానికి ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

గోల్ఫ్ కోర్సులు

విశాఖపట్నంలో ముడసర్లోవ పార్కు పక్కనే ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఉంది. నేవీ అధికారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. పెద్ద మొత్తంలో భూములు అవసరమయ్యే ఈ ప్రాజెక్టులకు పెట్టుబడులు పెట్టడానికి చాలామంది ముందుకు వచ్చారు. భోగాపురం, భీమిలి పరిసరాల్లో వీటికి భూములు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ప్లానెక్స్ రీసైక్లింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ గోల్ఫ్ కోర్సుతో పాటు రిసార్ట్ కూడా పెడతామని ముందుకు వచ్చింది. రూ.400 కోట్ల పెట్టుబడి పెట్టి, 4,200 మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. సన్‌విక్ గోల్ఫ్ అనే సంస్థ రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టి 1,350 మందికి ఉద్యోగాలు ఇస్తామని ఎంఓయూ చేసింది.

శబరిమల రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)కు కూడా అంతే డిమాండ్ నెలకొంది. వీటితోపాటు రోజూ నడిచే డిబ్రుగర్-నాగర్‌కోయిల్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504)లో జనవరి 16 వరకు బెర్తులు ఫుల్ అయిపోయాయి.

వారాంతపు రైళ్లకు డిమాండ్

వివిధ ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా ఎర్నాకులం చేరే వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనవరి 16 వరకు బెర్తులు లభించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి గురువారం నడిచే షాలిమార్-నాగర్‌కోయిల్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660) జనవరి 15 వరకు, ప్రతి సోమ, బుధవారం అందుబాటులో ఉండే షాలిమార్-త్రివేండ్ర ఎక్స్‌ప్రెస్ (22642) జనవరి 14 వరకు, ప్రతి శుక్ర, శనివారం నడిచే పాట్నా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (22644) జనవరి 9 వరకు, ప్రతి శనివారం అందుబాటులో ఉండే సిల్చార్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్‌కు (12508) జనవరి 3 వరకు, ప్రతి మంగళవారం నడిచే హటియా-ఎర్నాకులం ధాత్రి అబ్బా ఎక్స్‌ప్రెస్ (22837)లో జనవరి 6 వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఉంది.

శ్రీకాకుళం, కొల్లాం ప్రత్యేక రైలుపై వినతి

అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం వాల్తేరు రైల్వే అధికారులు 2023లో శ్రీకాకుళం-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడిపారు. ఈ ఏడాది అయ్యప్ప మాలధారుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గతంలో మాదిరిగా శ్రీకాకుళం రోడ్డు, కొల్లాం మధ్య ప్రవేశపెట్టాలని అయ్యప్ప భక్తులు కోరుతున్నారు.

మహా విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

భూమి/పార్కు/గెడ్డ/భవనానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవడం, కబ్జా చేసి నిర్మాణం చేపట్టడం చేస్తే ఆ స్థలానికి సంబంధించిన రికార్డులను పోలీసులకు లేదంటే టౌన్‌ప్లానింగ్ అధికారులకు అందజేసి పరిరక్షించాల్సిన బాధ్యత ఎస్టేట్ అధికారిపైనే ఉంటుంది. అలాగే చీఫ్ సిటీప్లానర్, కమిషనర్ వంటి ఉన్నతాధికారులకు ఏదైనా భూమికి సంబంధించిన అంశంపై సందేహం తలెత్తినా, ఫిర్యాదులు అందినా రికార్డులను పరిశీలించి వివరాలను వివరించాల్సిన బాధ్యత కూడా ఎస్టేట్ అధికారిపైనే ఉంటుంది. అందుకే ఎస్టేట్ అధికారి పోస్టులో భూ వ్యవహారాలు, వివాదాల పరిష్కారంలో అనుభవం కలిగిన సీనియర్ తహశీల్దార్ స్థాయి అధికారిని నియమిస్తుంటారు.

ఎస్టేట్ అధికారి ఉండగానే మరొకరు!

కానీ ఏం జరిగిందో తెలియదుగానీ తహశీల్దార్ స్థాయి అధికారిణి ఎస్టేట్ అధికారిగా ఉన్నప్పటికీ అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న ఒక అధికారిని తీసుకొచ్చి రెండో ఎస్టేట్ అధికారిగా నియమించారు. ఒకవేళ పనిఒత్తిడో, మరో కారణం చేతనో రెండో ఎస్టేట్ అధికారి అవసరమని భావించినా, భూవ్యవహారాలపై అవగాహన ఉన్న రెవెన్యూ శాఖ నుంచి మాత్రమే నియమించుకోవాలి.కానీ అందుకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారు. కొద్దినెలల కిందట డిప్యూటేషన్‌పై వచ్చినప్పటికీ ఈ విషయం బయటకు పొక్కలేదు. ఎస్టేట్ అధికారిగా ఉన్న రెవెన్యూ అధికారిణికి అధికారులు సైతం ప్రాధన్యం ఇవ్వకుండా అగ్నిమాపక శాఖ నుంచి వచ్చిన అధికారికే ప్రాధాన్యం ఇసున్నారు. తాజాగా కొంతమంది టౌన్ సర్వేయర్లతో సదరు అధికారి దురుసుగా వ్యవహరిస్తుండడంతో అగ్నిమాపక శాఖ అధికారి ఎస్టేట్ అధికారిగా నియమితులయ్యారనే విషయం బయటకు వచ్చింది. ఈ విషయం గురించి జీవీఎంసీ అధికారులతోపాటు కార్పొరేటర్లు సైతం ఉన్నతాధికారి వద్ద ప్రస్తావించగా, రాజకీయ పలుకుబడితో వచ్చారని సమాధానం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అగ్నిమాపకశాఖ అధికారి జీవీఎంసీకి చెందిన విలువైన భూములు అన్యాక్రాంతం అయితే ఎలా గుర్తిస్తారు, వాటిని అడ్డుకునేందుకు ఎలాంటి నివేదిక తయారుచేయాలి? ఎవరికి అందజేయాలనేది ఎలా తెలుస్తుందని విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

ఏజీపీగా కేపీ నాయుడు



కేపీ నాయుడు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది కేపీ నాయుడు అదనపు ప్రభుత్వన్యాయవాదిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీచేశారు. కేపీ నాయుడు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఏయూ న్యాయ కళాశాలలో చదివిన నాయుడు 2009లో న్యాయవాది వృత్తిని చేపట్టారు. అతని నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నరసింగరావు, బైపా అరుణ్‌కుమార్, కె.రామయోగేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ అభినందించారు.

ఆహార పొట్లాల పంపిణీ

అగనంపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి సత్రం జంక్షన్‌లో మంగళవారం బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో అనాథలు, యాచకులు, వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. సంస్థ సేవా కార్యక్రమంలో భాగంగా దాతల సాయంతో ప్రతి వారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రగ్గుల వితరణ

అగనంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలో ఉన్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు కలిపి 60 మందికి మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు గుదే సుశీలగజేంద్రరావు మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ ప్రతినిధి గంధోల నరసింగరావు ఆర్థిక సాయంతో రగ్గులు, మధ్యాహ్న భోజనం, రూ.100 నగదు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బొర్రమాంబకు పూజలు

అగనంపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్వెట్టర్ల వితరణ

ఆటోనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి భవితా కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు హైదరాబాద్‌కు చెందిన జీవాన్స్, పీఎస్‌వీఎస్ రాజు స్వెట్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఐఈ కో ఆర్డినేటర్ నీరజ మాట్లాడుతూ దివ్యాంగులకు చేయూతనందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి(మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రిస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 40, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 60, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 56, బీరకాయలు 54, ఆనపకాయ 36,కాలీఫ్లవర్ 48, క్యాబేజి 27, క్యారెట్ 56, దొండకాయలు 62, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 52, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమ దుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముదు చిక్కుడు 74, గోరు చిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

మహిళల భద్రతకు కలిసి పనిచేయాలి

- విశాఖలో అమలయ్యే విధానాలు ఆదర్శం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



సదస్సును ప్రారంభిస్తున్న రాయపాటి శైలజ

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రజ లంతా కలిసి పనిచేయాలని, ఒక వ్యక్తి, వ్యవస్థపై ఆధారపడి ఉండదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఏయూలో మంగళవారం సస్టైనింగ్ విమెన్-బెంచ్ మార్కింగ్ విశాఖపట్నం సక్సెస్ అండ్ ఫ్యూచర్ - ప్రూఫింగ్ గవర్నెన్స్ అంశం పై మహిళా కమిషన్, ఏయూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

జాతీయస్థాయిలో మహిళా భద్రతపై నిర్వహించిన నారీ-2025 ఇండెక్స్‌లో జాతీ య స్థాయిలో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విశాఖ మహిళా భద్రతకు సురక్షితంగా నిలవడంపై అభినం దించారు. సీఎం చంద్రబాబు సైతం అనేక సందర్భాల్లో విశాఖ ఎంతో సేఫ్ సిటీ అని చెప్పారన్నారు. మహిళల భద్రత కోసం ఇక్కడి విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవ సరం ఉందన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేం ధిర ప్రసాద్ మాట్లాడుతూ శారీరక భద్ర త మాత్రమే కాదని, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పించడం కూడా అన్నారు. విద్యతోనే ప్రతి మహిళకు పూర్తిస్థా యిలో భద్రత, భరోసా లభిస్తాయన్నారు. మహిళా సాధికారితకు ముందడుగు వేసేలా స్త్రీశక్తి పథకం నిలుస్తోందన్నారు. వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేశామని, మహిళల సమ్యలకు సూచనలు, సల హాలు, సహాయం అందిస్తామన్నారు. మూడు ప్రాంతాల్లో రూ.150 కోట్లతో వర్కింగ్ విమెన్స్ హాస్టల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళా విద్యా ర్థులకు భద్ర త కల్పించేలా మహిళా సెక్యూరిటీ గార్డులను నియమించా మ న్నారు. ఆరోగ్య సమాజం మహిళల భద్రతతోనే సాకారమవుతుం దన్నారు.విద్యార్థి విభాగంలో అసోసియేట్ డీన్‌గా మహి ళను నియమించామని, మూడు కీలకమైన డీన్ పోస్టులు, మూడు కళాశాలలకు ప్రిన్సిపాల్స్ మహిళలేనన్నారు. త్వరలో ఒక అధ్యయనం చేసి పాలసీ డాక్యుమెం ట్‌ను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళలకు భద్రత కల్పిం చే కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలే పోలీసులకు కళ్లు, చెవులు అన్నారు. మహిళలపై ఆన్‌లైన్ నేరాలు, వేధింపులు, అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ప్రొఫెసర్ ఎ.పల్లవి సదస్సు నిర్వహ ణ, ప్రాధాన్యతను వివరించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్స్ అధికారులు, ఉద్యోగు లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న దృశ్యం

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

- టీడీపీ 77వ వార్డు కార్యవర్గ సభ్యులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 77వ వార్డు తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మంత్రి రవి, మిగతా కార్యవర్గ సభ్యులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తమ వార్డులోని పార్టీ పరిస్థితిని వివరించి, రానున్న రోజుల్లో మరింత బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యకర్తల కోసం పార్టీ చేపడుతున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పల్లా ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారానికే 'నా కార్యకర్త'

- టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నిర్వహిస్తున్న 'నా కార్యకర్త' కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని టీడీపీ 86 వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- నషా ముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):సమాజాన్ని అస్తవ్యస్తంగా మార్చి, కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాల జోలికిపోవద్దని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలు పునిచ్చారు. మాదకద్రవ్య రహిత సమా జ స్థాపన లక్ష్యంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రి త్వశాఖ ఆధ్వ ర్యంలో ప్రారంభించిన నషా ముక్త అభి యాన్ కార్యక్రమానికి ఐదేళ్లు పూర్తైన సందర్భంగా ఆశాఖ మంత్రి వీరేంద్ర కుమార్ మంగళవారం అమృత్‌సర్ నుం చి వర్చువల్‌గా వివిధ రాష్ట్రాల యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ సందేశాన్ని చదివి వినిపించారు. ఏయూలోని ఎంవీఎస్ మూర్తి ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లా డుతూ మాదక ద్రవ్య రహితంగా విశాఖను తీర్చిదిద్దే మహాయజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఐదేళ్లలో ఎన్నో కార్యక్రమాలు నిర్వ హించామని, యువతలో చైతన్యం తీసుకువచ్చామన్నారు. డీ అడిక్షన్ సెం టర్ల ఆవశ్యకతను వివరించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యా లతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. నగరంలో ఎవ రైనా తీవ్ర సమస్యలతో బాధపడితే డీ అడిక్షన్ కేంద్రాలను సంప్రదించాలని ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972, సీపీ వాట్సాప్ నంబరు 7005095799 గాని సంప్రదించాలన్నారు. అనంతరం ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) జోనల్ డైరెక్టర్ పంకజ్‌కుమార్ ద్వివేదీ మాట్లాడారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సం క్షేమ శాఖ అసిస్టెం ట్ డైరెక్టర్ కవిత, అధికారులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు..

ఉక్కుటౌన్‌షిప్: మాదకద్రవ్యాలను అలవాటు చేసుకోవడం వల్ల జీవితం నాశనమవుతుందని ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.వివేకానందరావు అన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కళాశాలలో మంగళవారం 'నషా ముక్త్ భారత్ అభియన్' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కుటుంబాలు, జీవితాలు ఛిన్నాభిన్నం అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలి

మల్కాపురం: మాదకద్రవ్య రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని 58వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, మలేరియా విభాగం అధికారి డి.రవికుమార్ పిలుపునిచ్చారు. 'నాషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మంగళవారం శ్రీహరిపురంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తోందని, మాదకద్రవ్య రహిత భారతదేశాన్ని నిర్మించడం యువత ప్రధాన లక్ష్యమన్నారు.

సముద్రంలో పడి వ్యక్తి మృతి



లక్ష్మణరావు (ఫైల్ ఫొటో)

బీచ్ రోడ్డు, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు సముద్రంలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. సహచరులు 9 మందితో కలిసి జాలారిపేటకు మేరుగు లక్ష్మణ్‌రావు (37) నాలుగు రోజుల కిందట బోటుపై వేటకు వెళ్లాడు. తీరానికి సుమారు వంద నాటికల్ మైళ్ల దూరంలో వేట చేస్తుండగా సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో బోటుకు లంగరు వేశారు. ఆ సమయంలో లక్ష్మణరావు కాలుకు లంగరు తాడు చుట్టుకుపోవడంతో అదుపుతప్పి సముద్రంలో పడిపోయాడు. అతడిని రక్షించడానికి సహచరులు తీవ్ర ప్రయత్నం చేశారు. కొంత సమయం తరువాత వెలికితీశారు. అప్పటికే అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని ఫిషింగ్ హార్బర్‌కు తీసుకువచ్చారు. లక్ష్మణరావు మృతితో జాలారిపేటలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబానికి పెద్దదిక్కు లేకపోవడంతో భార్య పద్మావతి, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒన్‌టౌన్ సీఐ వరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగివున్న టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

- కేబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్
- ఆరుగంటలు శ్రమించి రక్షించిన స్థానికులు
- రాంపురం వద్ద ఘటన



లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

పెందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగి వున్న టిప్పర్‌ను ఢీట్టిన ఘటనలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుని ఆరుగంటలు నరకయాతన అనుభవించాడు. ఈ సంఘటన రాంపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి... సబ్బ వరం నుంచి ఫ్లయాష్ లోడుతో లారీ పద్మనాభం బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజాము 5గంటలకు రాంపురం వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. క్యాబిన్‌లో డ్రైవర్ సాయి (40) చిక్కుకున్నాడు. సమాచారం మేర కు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాకచర్యలు చేపట్టారు. 108 వాహన సిబ్బంది డ్రైవర్ అపస్మారకస్థితికి వెళ్లకుండా చికిత్స చేశారు. డ్రైవర్ బంధువులు, స్నేహితులు గ్యాస్ కట్టర్లతో ఆరు గంటలు శ్రమించి డ్రైవర్‌ని బయటకు తీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కార్యకర్తలతో కలిసి పర్యటిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

56వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యటన

ఆర్పీపేట(కంచరపాలెం),నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జీవిఎంసీ 56 వార్డులో దయానందనగర్, చాకలి గెడ్డ ప్రాంతాల్లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పర్యటన చేశారు. మొంథా తుఫాన్ కారణంగా ప్రధాన గెడ్డల్లో పేరుకుపోయిన పూడికల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ గణబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గణబాబు మంగళవారం ఆ గెడ్డలను పరిశీలించి పూడికలను తొలగించి మురుగు సజావుగా పోయేటట్టు చర్యలు చేపట్టాలని జడ్సీ రామును ఆదేశించారు. అవసరమైన చోట మరమ్మతులు ప్రారంభించాలన ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడితే సహించేది లేదని హెచ్చరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పూజారి ఉదయ్‌కుమార్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదలైన రూ.38 వేల చెక్కును అందజేశారు.

గ్రామాభివృద్ధి ఎమ్మెల్యే సూచనలు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతలలోవ గ్రామంలో ఇటీవల జరిగిన ప్రెసిడెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన నానిపల్లి నానాజీ, కమిటీ సభ్యులు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ 14 సంవత్సరంగా గ్రామంలో ప్రెసిడెంట్ ఎన్నికలు నిర్వహించకపోవడం గమనార్హమని, ఇప్పుడు యువకుల ముందడుగుతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారని అన్నారు. అనంతరం నానాజీని సత్కరించి గ్రామాభివృద్ధికి పలు సూచనలు చేశారు.

20 రోజుల్లో స్వర్ణభారతి పనులు పూర్తిచేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం



స్వర్ణభారతి స్టేడియం పునర్నిర్మాణపనులు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియం పునర్నిర్మాణపనులను 20రోజుల్లోగా పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన పనులు పరిశీలించారు. పరిసరాల్లో డెబ్రిస్ పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాదిన్నరగా పునర్నిర్మాణపనులు కొనసాగిస్తుండడంపై కాంట్రాక్టర్‌తోపాటు పనులను పర్యవేక్షిస్తున్న ఏపీయూఏఎంఎల్ ప్రతినిధులపై అసంతృప్తివ్యక్తంచేశారు. 20 రోజుల్లోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

తాగునీటికి నాణ్యత పరీక్షలు తప్పనిసరి: కేతన్‌గార్గ్

గాజువాక: నీటి సరఫరా పంపింగ్ స్టేషన్‌ల నిర్వాహణను మరింత మెరుగుపర్చాలని, నిత్యం ప్రజలకు అదిస్తున్న తాగునీటికి నాణ్యత పరీక్షలు నిర్వహించేలా పంపింగ్ స్టేషన్‌లో చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. గాజువాక జోన్ పరిధి సుందర్యకాలనీలో 10ఎంజీడీ నీటి పంపింగ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంపులు, నీటి సరఫరా చేసే విధనం, శుద్ధి చేసే ప్రక్రియ, నీటి కెపాసీటి వంటివి క్షుణ్ణంగ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి నాణ్యత ప్రమాణాలు పెంచి ప్రజలకు శుద్ధి తాగునీరు అందించాలన్నారు. నిత్యం శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపాలని సూచించారు.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వచ్చే నెల 13న నిర్వహించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వేడుకలకు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి సతీమణి సుధా నారాయణమూర్తి హాజరుకానున్నారు. ఈ మేరకు సంఘం వివరాలను వెల్లడించింది. ఏటా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రంథి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏటా వేడుకలను నిర్వహిస్తున్నారు.

క్విజ్ పోటీలు

పెదగంట్యాడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. న్యూపోర్టు ఎస్‌ఐ కె.శ్యామసుందర్, ఏఎస్‌ఐ ఎంవీ.రమణ ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ పోటీలను ప్రారంభించారు. పెదగంట్యాడ ప్రాంతంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. డి. వరలక్ష్మి, మనోహర్ ఆలీ క్విజ్ మాస్టర్లుగా వ్యవహరించారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

వ్యాసరచన పోటీలు

పెందుర్తి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి చంద్రకళ, కమిటీ కార్యదర్శి ఆడారి రామకృష్ణ పాల్గొన్నారు.

భాషను కాపాడడం యువత కర్తవ్యం

మల్కాపురం: తెలుగు భాషా సంస్కృతులను కాపడడం యువత కర్తవ్యంమని కళారత్న చలపతిరావు పేర్కొన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన కవి సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో యువత తెలుగు రచనలపై దృష్టి పెట్టాలని అన్నారు. అనంతరం విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడారు. కవులకు ఆదరణ కలిగించడం కోసం అన్ని గ్రంథాలయాల్లో కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కవుల కవితలను చదివి వినిపించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: బొండా జగన్

కూర్మన్నపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బాలుర, బాలికల అండర్-14 జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా తుంగ్లాంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఊరేగించి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ పూజల్లో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న పురాతన శివాలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగనంపూడి,: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం, భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తి: కార్తీక మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా పాతపెందుర్తి శివాలయంలో శివపార్వతులు కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు, అనురాధ దంపతులు కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాధన కార్యక్రమాన్ని శరగడం ప్రారంభించారు.

బాలకృష్ణకు ఘన స్వాగతం



అభిమానులకు అభివాదం చేస్తున్న నందమూరి బాలకృష్ణ

గోపాలపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగే అఖండ-2 సినీ కార్యక్రమంలో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణకు విమానాశ్రయంలో అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. బెంగుళూరు నుంచి ఇండిగో విమానంలో మంగళవారం ఉదయం ఆయన విశాఖ చేరుకున్నారు. అనంతరం సినిమా దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి సింహాద్రి అప్పన్న దర్శనానికి ఆయన రోడ్డు మార్గంలో వెళ్లారు.

కొత్తపాలెం అండర్‌పాస్ మరమ్మతులు పూర్తి

గోపాలపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపాలెం అండర్‌పాస్‌వేలో చేపడుతున్న మరమ్మతులు పూర్తయ్యాయి. రెండు రోజులుగా అండర్ పాస్ వద్ద శిథిలమైన రహదారికి మరమ్మతులు చేపడుతున్నారు. బుధవారం నుంచి అండర్‌పాస్‌వేలో రాకపోకలు పునరుద్ధరణ చేయనున్నారు.

వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి

అగనంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పేర్కొన్నారు. వార్డులోని పెదమడక శెట్టి బలిజ వీధిలో తాగునీటి బోరును ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా కృషి చేయాలని కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. మిందికాలనీలో ఉన్న పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఆమె దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ లతీశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.